# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 5-9-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:29 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

పాలాభి షేకం
పౌష్టికం నేల పాలు
ఆకలి రాజ్యం

అప్పు పై అప్పు
రైతు ఋణ విముక్తి
జనం పై భారం

కాకుల కాకు
ఓ కాకిని కట్టేస్తే
అస్తిత్వ కాక.

దొంగ బంగారం
చీకటి వ్యాపారాలు
పగటి చుక్క

రేసు గుర్రాలు
చిన్న తరాహ శేర్లు
అదొక జూదం



\- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

జిల్లాల్లోను కమిటీలు
రాష్ట్రం అంతా హైడ్రా !
ఆక్రమిస్తే కూల్చుదేను
చేసేది లేదు విత్ డ్రా !
ఆక్రమించింది సీదా
అప్పగిస్తే సరే !
కాదు పోదంటే ఇంక
బిగిస్తాం జాగకురే !



\- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# గంజాయిని కూకటివేళ్ళతో పెకిలించాలి

**-రాపిడ్ టెస్టులు నిర్వహించాలి**
**-గంజాయి అమ్మినా, తీసుకున్నా జైలుకు పంపండి**
**-యాంటి సోషల్ ఎలిమెంట్స్ ని సహించేది లేదు**
**-కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

నల్గొండ, సెప్టెంబర్ 4 :మునుగోడు నియోజకవర్గంలో గంజాయిని కూకటివేళ్లతో పెకిలించడానికి పోలీసులు నిబద్ధతతో పనిచేయాలని, దానికి తన ఫుల్




సపోర్ట్ ఉంటుందని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఈరోజు మండల కేంద్రంలోని తన వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో పోలీసులతో సమావేశం నిర్వహించారు. మును గోడు మండలంలో బెల్ట్ షాపులు, గంజాయి నిర్మూలనకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, అవసరమైతే అరెస్టు చేసి జైలుకు పంపండని కఠినంగా ఆదేశాలు జారీ చేశారు. మండలంలో యాంటీ సోషల్ ఎలిమెంట్స్ కి ఎవరు పాల్పడిన సహించేది లేదని, వాళ్లపైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. మునుగోడు సర్కిల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై 30కేసులు నమోదు చేశామని, 105 మందిని బైండోవర్ చేశామని పోలీసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువ చ్చారు. బెల్ట్ షాపుల నిర్మూలనకు కఠినంగా వ్యవహరించాలని ఆదేశం చారు. మునుగోడు నియోజకవర్గానికి గంజాయి ఎక్కడ నుండి వస్తుందో వాటి మూలాలను తెలుసుకొని అరికట్టాలన్నారు. గంజాయికి అలవాటైన వారికి కౌన్సిలింగ్ ఇస్తూ గంజాయి బారిన పడకుండా చూడా లన్నారు. ఈ సమావేశంలో చండూరు సిఐ వెంకటయ్య, మునుగోడు ఎస్సై చందా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# భద్రాచలంలో గోదావరి ఉగ్ర రూపం .. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

భద్రాచలం సెప్టెంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో' భద్రాచలంలో గోదావరికి వరద పోటెత్తుతున్నది. గంట గంటకు వరధ ఉధృతి పెరుగుతున్నది. నీటి మట్టం 43.1 అడుగులు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ క్రమలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. వాగులు, చెరువులు వద్దకు ఎవరు సందర్శకులు వెళ్ల కూడదని, మత్స్యకారులు గోదావరి వద్దకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున గోదావరి నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నది. కాగా, 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు నీటి మట్టం చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రస్తు తం వర్షాలు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తో పాటు గోదావరి పరీవాహక ప్రాం తంలో వర్షాలు దంచికొడుతున్నాయి. దాంతో వరద పెరిగే అవకాశం కనిపిస్తున్నది.

# యశోద హాస్పిటల్ గ్రూప్స్ రూ. కోటి విరాళం - భట్టికి చెక్కు అందజేత

హైదరాబాద్, సెప్టెంబర్ 4 :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుతో వరద బాధితులను ఆదుకునేందుకు అపన్న హస్తాలు ముందుకు వస్తున్నాయి. దాతలు తమ శక్తిమేర ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు అందజేస్తున్నారు.. ఈ నేపథ్యంలోనే యశోద హాస్పిటల్ గ్రూప్స్ కోటి రూపాయల విరాళం ప్రకటించింది..విరాళం చెక్కును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆస్పత్రి ఆపరేటర్స్ చీఫ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి నేడు అందజేశారు. ఆపద కాలంలో దాతృత్వాన్ని చాటుకున్న యశోద హాస్పిటల్స్ చైర్మన్ రవీందర్ రావు, డైరెక్టర్లు సురేందర్రావు, దేవేందర్ రావులను ఉప ముఖ్యమంత్రి అభినందించారు.



# చినుకు పడిన క్షణం నుంచి ప్రజల్లోనే ఉన్నాం

**-మా ముందస్తు చర్యల వల్ల వీలైనంత ప్రాణ నష్టం తగ్గించగలిగాం**
**-పదేండ్లలో డిజాస్టర్ మేనేజ్మెంట్ పూర్తిగా నిర్లక్ష్యం చేశారు**
**-విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు**
**-ప్రజల రక్షణే మాకు ముఖ్యం**
**-రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



హైదరాబాద్, సెప్టెంబర్ 4 :ఆనాడు 2022 లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వచ్చిన భారీ వర్షాలు, వరదలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వారి వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి వర్షాలు క్లౌడ్-బరస్ట్, విదేశీ కుట్ర అంటూ మతిలేని ప్రకటనలు చేసిన బీఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత ఎక్కడిదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. విదేశీ కుట్ర అని ఫార్మ్ హౌస్ దాటని బీఆర్ఎస్ పార్టీ పెద్దలు ఈరోజు వరదల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆనాడు ప్రకృతిపరంగా కురిసిన వర్షాలను కూడా కుట్రకోణంలో చూసిన ఆ పెద్దమనిషి, ఆ దొరవారి అల్లుడు హరీష్ రావు కూడా ఇప్పుడు వచ్చిన వర్షాలను కుట్ర కోణంలోనే చూస్తున్నా రా అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

వరదలపై మంగళవారం ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను పొంగులేటి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

"వరదల్లో కారు కొట్టుకుపోయి చనిపోయిన సైంటిస్టు నునావత్ అశ్విని కుటుంబాన్ని మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కలిసి క్యాబినెట్ సహచర మంత్రులం పరామర్శించి, భరోసా కల్పించాం. కనీసం చనిపోయిన కుటుంబాలను పరామర్శి ంచాలన్న సోయి కూడా బీఆర్ఎస్ పెద్దలకు లేకపోవడం దురదృష్టకరం.

జైలు నుండి వచ్చిన బిడ్డను ఆశీర్వదించడానికి ప్రతిపక్ష నేత కేసీఆర్ కు సమయం ఉంటుంది కానీ, వరద కష్టాల్లో ఉన్న ప్రజలను పరామర్శించడానికి గడప దాటడం లేదు. పదేండ్ల పాలన అనుభవంతో ప్రతిపక్ష నేత కేసీఆర్ ఒక సలహానైనా సూచననైనా చేస్తారని భావించామని, కానీ ఆయన పెదవి కూడా విప్పకపో వడం దురదృష్టకరం. ఇంకా ఆయన కుమారుడు కేటీఆర్ అమెరికాలో ఉండి, ఇక్కడ ఏమి జరుగుతుందో తెలియకుండా, అజ్ఞానంతో ఇష్టం వచ్చినట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఆయన ఎందుకు అమెరికా వదిలి రావడం లేదు ? అధికార పార్టీని తిట్టడమే ప్రతిపక్ష పార్టీ పని అన్నట్టుగా మా మీద దాడి చేస్తున్నారు. ఓటు వేసిన వేలుకు సిరా చుక్క కూడా తొలిగిపోయిందో లేదో అప్పటినుంచే దాడి మొదలుపెట్టారు. పది సంవత్సరాలలో విపత్తుల నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్మెంట్) విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఒక్క నాడైనా ప్రకృతి విపత్తులమీద సమావేశం నిర్వహించారా ? దాన్ని బలోపేతం చేయాలన్న ఆలోచన చేశారా ? దాన్ని బలోపేతం చేసి ఉంటే ఈరోజు ఈ పరిస్థితి వచ్చేదా? కొంతలో కొంతైనా ముప్పు తగ్గేది కదా !

రాష్ట్రంలో, ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో ఒక్కసారిగా ఆకాశం నుంచి నీళ్ళు గుమ్మరించినట్టుగా, తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురవడం తో ఊహించని నష్టం వాటిల్లింది. అయినప్పటికీ ప్రభుత్వం ముందు జాగ్రత్తగా తీసుకున్న చర్యలు, వర్షం అనంతరం ప్రజలను రక్షించడంలో, వారికి కావలసిన వసతులు కల్పించి ఆదుకోవడంలో చూపిన చొరవ, అందించిన సహాయ సహకారాల కారణ ంగా అపారనష్టాన్ని తగ్గించగాలిగాం.

ముఖ్యంగా ఖమ్మంజిల్లాకు సంబంధించి నాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అందరం కలిసి సమన్వయంతో పని చేయడం వల్లే ప్రాణ నష్టాన్ని, కనిష్ట స్థాయికి తగ్గించగలిగాం. ప్రజలను ఆదుకోవడానికి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, కోడి పిల్లలను కాపాడినట్టు జిల్లా ప్రజలను రక్షిస్తూ వచ్చాం. మరోవంక ముఖ్యమంత్రి కూడా స్వయంగా ఖమ్మం జిల్లాలో పర్యటించి, పరిస్థితిని పూర్తిస్థాయిలో అంచనా వేసేందుకు అక్కడే రాత్రిపూట బసచేసి మరీ ప్రజలను ఆదుకున్నారు. ప్రజలకు తక్షణావసరాలను అందించారు.

గతంలో ఖమ్మం జిల్లాలో వరదలు వస్తే పదివేలు చొప్పున సహాయం చేస్తామని చెప్పి చేతులెత్తేసినవారు ఇప్పుడు యాభై వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడం విచిత్రంగా ఉంది. ఇదంతా ఇంకా ప్రజలు మరచిపోలేదు. బీఆర్ఎస్ బురద రాయకీయాలను మేము పట్టించుకోవడం లేదు. మాకు ప్రజలు ముఖ్యం. వారి రక్షణ ముఖ్యం. రాష్ట్రంలో చివరి బాధితుడికి కూడా ప్రభుత్వ సహాయం అందేటట్టు చూడటమే మాధ్యేయం" అని అన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులు విరాళం ఇవ్వడం అభినందనీయం.. షబ్బీర్ అలీ

నిజామాబాద్, సెప్టెంబర్ 4 :తెలంగాణలో భారీ వర్షాలు, వరదల కారణంగా సర్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడానికి జిల్లా ఉద్యోగులు ఒకరోజు వేతనం అందజేయడం అభినందనీయమని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బుధవారం నిజామాబాద్ నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిజామాబాద్ జిల్లా ఉద్యోగుల జేఏసీతో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సమావేశమయ్యారు. నిజామాబాద్ జిల్లా ఉద్యోగుల ఒకరోజు వేతనం సుమారు రూ. 5కోట్ల వరద బాధితులకు అంద జేశారు. అనంతరం ఉద్యోగులు తమ సమస్యలను షబ్బీర్ అలీకి విన్నవించుకున్నారు. షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మీ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తానన్నారు.

ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. తెలంగాణలో భారీ వర్షాలు, వరదల కారణంగా సర్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నా రు. పలువురు సీఎం సహాయనిధికి విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి అండగా నిలుస్తూ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులంతా ఉదారత చాటుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. వరద బాధితుల కోసం రాష్ట్ర ఉద్యోగులంతా కలిసి తమ ఒకరోజు మూల వేతనం రూ. 130 కోట్లను ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ఇచ్చారన్నారు.

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ నాయకులు తమతో కలిసి సంతకాలతో కూడిన అంగీకార పత్రాన్ని అందజేశారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. వరద బాధితుల కోసం ప్రభుత్వ ఉద్యోగులు ఒకరోజు మూల వేతనాన్ని అందించడం వారి మానవత్వానికి ఒక ప్రతీక అన్నారు. మనస్ఫూర్తిగా వారిని అభినందిస్తున్నానని చెప్పారు. త్వరలోనే ఉద్యోగ సంఘాలతో సచివాలయంలో ప్రత్యేకంగా ముఖ్యమంత్రి సమావేశ మవుతారని తెలిపారు. తెలంగాణ ప్రజలు విపత్తులో ఉన్న సమయంలో ఉద్యోగులంతా కలిసి సీఎం సహాయ నిధికి విరాళం ఇవ్వడం గొప్ప విషయమని షబ్బీర్ అలీ ప్రశంసించారు.

# హైడ్రాకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించి వసూళ్లకు పాల్పడితే జైలుశిక్ష

**-హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరిక**


హైదరాబాద్ సెప్టెంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : హైడ్రాకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించి వసూళ్లకు పాల్పడితే జైలు జీవితం తప్పదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. కొద్ది రోజులుగా ట్రై సిటీ పరిధిలో హైడ్రా విభాగం అక్రమ నిర్మాణాల తొలగింపులు చేపడుతున్న నేపథ్యంలో కొద్దిమంది సామాజిక కార్యకర్తల ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నారు. బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్ పరిధిలో లేదా వాటి పరిసరాల్లో నిర్మాణం చేపడుతున్న బిల్డర్ల ను ఇది అక్రమ నిర్మాణమని, బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్ పరిధిలో నిర్మిస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తున్నారు. అలాగే అధికారులతో ఉన్న ఫొటోలు చూపించి హైడ్రా విభాగంలోని ఉన్నతాధికారులతో తమకు పరిచయాలు ఉన్నాయని, మీకు ఎలాంటి సమస్య రాకుండా చేస్తామని ఇందుకోసం కొంత డబ్బు ముట్టజెప్పాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు.

# ఆందోళన వద్దు, దోషులను కఠినంగా శిక్షిస్తాం : మంత్రి సీతక్క

హైదరాబాద్, సెప్టెంబర్ 4 : : ఆసిఫాబాద్ జిల్లాలో ఆటో డ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడి గాంధి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న మహిళను మంత్రి సీతక్క పరామర్శిం చారు. బాధితురాలికి అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. హాస్పిటల్ నుంచే జిల్లా ఎస్పీతో మాట్లాడారు. నిందితుడిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. నిందితు లు ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు.

దాడి ఘటన వెలుగులోకి రాగానే నిందితుడిని అరెస్టు చేసాం. నిందితు డికి కఠిన శిక్ష పడేలా ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. జైనూరు ఆదివాసీ యువతి సంయమనంతో ఉండాలని కోరారు. ఆందోళన అవసరం లేదు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని భరోసానిచ్చారు. కాగా, ఆటో డ్రైవర్ దాడిలో మహిళ గాయపడటంపై జైనూర్లో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. జైనురు మండల కేంద్రంలో పలు దుకాణాల సముదాయాలకు నిప్పు పెట్టారు. పలు వాహనాలను సైతం తగలబెట్టారు.

# మౌనశ్రీకి గౌరవ పురస్కారం



సినీ రచయితల సంఘం త్రిదశాబ్ది ఉత్సవాలు ఫిలింనగర్ కల్చరల్ సెంటర్లోని సూపర్ స్టార్ కృష్ణ హాల్లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దర్శకులు కె. రాఘవేంద్రరావు, బి. గోపాల్, సీనియర్ నటుడు మురళీమోహన్, నిర్మాత డి. సురేష్ బాబు హాజరయ్యారు.

ఈ వేడుకల్లో భాగంగా జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు, డాక్టరేట్, డిలిట్ గౌరవాలు, ఆస్కార్ అవార్డు పొందిన ఆర్ ఆర్ ఆర్ సినిమా యూనిట్ ను మరియు 40 సంవత్సరాలుగా సినీ రచయితలుగా కొనసాగుతున్న సంఘ సభ్యులను ఈ వేడుకల్లో ఘనంగా సత్కరించింది.

తానా అంతర్జాతీయ కవితా పురస్కారం పొంది, టెలివిజన్ సీరియళ్లలో అత్యధిక పాటలు రాసినందుకుగాను మౌనశ్రీ మల్లిక్ ను గౌరవ పురస్కారంతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్, తనికెళ్ల భరణి, సత్యానంద్, పరుచూరి వెంకటేశ్వరరావు, వద్దేపల్లి కృష్ణ పాల్గొన్నారు.సంస్థ అధ్యక్షుడు పరుచూరి గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉమర్జీ అనురాధ, కోశాధికారి నటరాజ గోపాల మూర్తి మౌనశ్రీ మల్లిక్ ప్రతిభను ప్రశంసించారు.

**నేటి కందం- నేటికి అందం**

అనయము గురువుల దినముగ
వినయముతో భక్తితోడ విభవము తోడన్
ఘనుడగు రాధాకృష్ణన్
జననమ్మొందిన దినమును జరుపగ వలయుఁ

(సెప్టెంబరు 5 : జాతీయ ఉపాధ్యాయ దినం)



\-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

కాలం పనికిరాని
కొన్నిటిని కడిగేస్తది
కొత్తవెన్నో పట్టుపట్టి
కావలసి తొడిగేస్తది
గతంలోనె ఉంటనంటే
గతిశీలం ఒప్పదు
ఇష్టమున్న లేకున్నా
ఇముడ్చుకోక తప్పదు



\-వేల్పుల నారాయణ
9440433475

# ఉపాధ్యాయుడి ప్రమేయం లేకుండా ఎదిగిన వ్యక్తులు ఉన్నారా !

స్వతంత్ర భారత తొలి ఉపరాష్ట్రపతి, ద్వితీయ రాష్ట్రపతి, అపర మేధావి, సామాజిక శాస్త్రవేత్త, తత్వవేత్త, ఆదర్శ ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని 05 సెప్టెంబర్‌న దేశవ్యాప్తంగా "జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని'' పండుగ వలె వాడవాడల, అన్ని విద్యాలయాల్లో ఘనంగా నిర్వహించుకుంటున్నాం. మట్టిని మాణిక్యంగా, మనిషిని మహామనీషిగా, సాధారణ వ్యక్తిలో వ్యక్తిత్వ వెలుగులు నింపుతూ, నిరక్షరాస్యుడిలో అక్షర విత్తులు నాటుతూ, రేపటి తరాన్ని నిర్మించే మహాయజ్ఞంలో ప్రధాన భూమికను నిర్వహించేది ఉపాధ్యాయుడు ఒక్కడే. భవిష్యత్ తరం నిర్మాణంలో, దేశ సమగ్రాభివృద్ధిలో గురువు పాత్ర అమోఘం, అద్వితీయం, అనిర్వచనీయం.

**భగవంతుడి ప్రతిరూపాలు ఉపాధ్యాయులు:**

భారతీయ సంస్కృతిలో గురువు మూల స్తంభంగా నిలబడి ఉన్నాడు. జగన్నాథుడు శ్రీ కృష్ణుడు, సకల గుణ సంపన్నుడు శ్రీ రాముడు కూడా గురువు చెక్కిన అపురూప భగవత్ రూపాలే. సన్మార్గాన్ని చూపే దీపస్తంభం, రాతిని నాతిగ మార్చగల నేర్పరి, ప్రతి అర్థవంతమైన ప్రశ్నకు సమాధానం ఇవ్వగల మహాజ్ఞాని, విజ్ఞాన వితరణశీలి, జ్ఞాన బోధకుడు, వివేక జ్యోతి, నిస్వార్థ అక్షర కర్షకుడు, సమాజ క్షేత్రంలో విలువల విత్తులు నాటే అనంత విజ్ఞాన మేధోసంపన్నుడు అయిన ఉపాధ్యాయుడు సమాజ నిర్మాతగా అద్వితీయ సేవలను అందిస్తున్నాడు. గురువును గౌరవించని సమాజం నరక సమానం. గురు బోధనలు వినని విద్యార్థి వింత జంతువే. గురువును నమ్మని శిష్యుడు నిరక్షరాస్యుడు. గురువు రేపటి తరానికి విజ్ఞాన వివేక పాఠాల బోధకుడు మాత్రమే కాదు సన్మార్గాల బాట చూపగల మార్గదర్శి.

**ఆదర్శ ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్:**

05 సెప్టెంబర్ 1888న తిరుత్తని, ఆంధ్రప్రదేశ్‌లో బ్రాహ్మణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన రాధాకృష్ణన్ విద్యాభ్యాసం తిరుపతి, వెల్లూర్‌లలో కొనసాగింది. చెన్నైలో ఫిలాసఫీలో పిజీ చేశారు. చెన్నై, కలకత్తా, మైసూర్‌లలో ఆచార్యుడిగా విశిష్ట సేవలు అందించారు. భారతీయ తత్వాన్ని విశ్వ వ్యాప్తం చేయుటలో సఫలీకృతులైనారు. ఆంధ్ర, బెనారస్ విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా సేవలను అందించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని 05 సెప్టెంబర్ 1962 నుంచి దేశవ్యాప్తంగా 'జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం' జరుపుకుంటున్నాం. అత్యంత ప్రతిభాశాలి అయిన రాధాకృష్ణన్ పేరును 16 సార్లు లిటరేచర్‌లో, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేయబడింది. యునెస్కో బోర్డుకు చైర్మన్‌గా పని చేశారు. గౌతమ బుద్ధ, రవీంద్రనాథ్ ఠాగూర్ తత్వాలపై మాత్రమే కాకుండా సమకాలీన ఫిలాసఫీలో పలు రచనలు చేసి ప్రపంచ దేశాలను ఆశ్చర్య చకితులను చేశారు. 16 ఏప్రిల్ 1975న తుది శ్వాస విడిచిన రాధాకృష్ణన్ సదా గురువులకు, విద్యార్థులకు ఆదర్శ ఉపాధ్యాయుడే.

**విద్య సమపార్జనలో కేంద్ర బిందువు:**

మానవ సమాజోద్ధరణ మహాయజ్ఞంలో ప్రథమ స్థానం గురువుదే. పేదరికం, అధిక జనాభా, అనారోగ్యాలు, ఆకలి చావులు, నిరుద్యోగం లాంటి సమస్యలకు సమాధానం విద్యాధిక సమాజ నిర్మాణమే. విద్య సమపార్జనలో ఉపాధ్యాయుడే కేంద్ర బింధువు. లేత విద్యార్థి శారీరక, మానసిక ఎదుగుదల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలిగేది గురువు మాత్రమే. ఆధునిక సమాజంలో విలువలు, ప్రాధాన్యతలు మారుతున్నాయి. ఉపాధ్యాయుల అంకితభావంలో కూడా మార్పు కనిపిస్తున్నది. ఉపాధ్యాయ వృతి వెలకట్టలేనిది, అత్యంత పవిత్రమైంది. నేటి ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం రేపటి సమాజ అశాంతికి కారణం అవుతుంది. బోధన వృత్తి కాదు, అదో పవిత్ర బాధ్యత అని గురువులు గుర్తెరగాలి. చురుకైన, అత్యాధునిక, సృజనశీల, వినూత్న, మేధో వికసిత సమాజ నాయకులను తయారు చేయగలిగే సామర్థ్యం ఉపాధ్యాయుడి సొంతం. అసంఘటిత మానవ వనరులను సంఘటిత, సదాలోచనల శాస్త్రసాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దగల నేర్పరి గురువు మాత్రమే. నేటి ఉపాధ్యాయుల్లో కూడా కొంత వ్యాపార ధోరిణి కనబడుతోంది. పాఠశాలలో బెల్, బిల్ సంస్కృతి పెరుగుతోంది. చదువు సంస్కృతిని, సాంప్రదాయాలను, మానవీయ విలువలను పెంపొందించాలి. పుస్తకంలోని పాఠాల బోధనతో పాటు జీవన నైపుణ్యాలను, జీవించే కళను నేర్పించగలగాలి. పాఠ్యాంశాల్లో పట్టు, సుక్ష్మ గ్రాహకశక్తి, అనువర్తిత పరిజ్ఞానం, సంక్షోభాలను అధిగమించగల నేర్పు లాంటి పలు అంశాలను అందించగలిగిన వారే అసలైన గురువులు అవుతారు. గురు శిష్య పరంపర ఆరోగ్యంగా, బలంగా కొనసాగితేనే సమాజోద్ధరణ సుసాధ్యం అవుతుంది. నేటి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు ఉపాధ్యాయులను అతి సాధారణ ఉద్యోగులుగానే చూస్తున్నారు. గురువుకు ఇవ్వాల్సిన కనీస గౌరవాలు పలుచబడుతున్నాయి. గురువును నిర్లక్ష్యం చేస్తే రేపటి తరం శిక్షను అనుభవిస్తుంది.

**చదువు, సంస్కారాల కలబోత:**

'గురు సాక్ష్యాత్ పరఃబ్రహ్మ' అనే నానుడి మన నరనరాల్లో జీర్ణించుకుపోవాలి. గురువులో దైవాన్ని చూడగలిగే విద్యార్థులు రేపటి సమాజంలో పూజ్యనీయులు అవుతారు. పరీక్షలో పాస్ కావడానికే కాదు, పరిపూర్ణ వ్యక్తిగా ఎదగడానికి చదువులు ఉపకరించాలి. విలువలు బోధించని విద్య, సుగంధమే లేని ప్లాస్టిక్ మల్లెపువ్వు లాంటిది. 'మొక్కై వంగనిది మానై వంగునా' అను నానుడిని నిరంతరం గుర్తుంచుకోవాలి. బాల్యం నుంచే చదువు, సంస్కారాలు నూరిపోయాలి. బాధ్యతగల రేపటి పౌరులను తయారు చేసే కేంద్రాలుగా విద్యాలయాలు పూజ్యనీయ క్షేత్రాలుగా నిలబడాలి. జ్ఞాన భాండాగారం, ప్రేరణామూర్తి, ప్రేమ చెలిమె, స్నేహ హస్తం, సంస్కర్త, బోధకుడు, మెంటర్, గైడ్, వివేక సంపన్నుడు, విజ్ఞాన గని, శాంత సముద్రుడు, ఫెసిలిటేటర్, డిమానిస్ట్రేటర్, నైపుణ్య ఊట, నాయకత్వ బాట, తడబడినపుడు ఊత కర్ర, సదా స్మరణీయుడు, నిత్య విద్యార్థి అయిన గురువును మన మనోమందిరాల్లో స్థాపించుకొని సన్మార్గంలో నడుద్దాం, విజ్ఞాన సమాజానికి దిశ నిర్దేశనం చేద్దాం. మనసాక్షిగా నమ్మిన దేవున్ని, జన్మనిచ్చిన తల్లితండ్రులను, గురువుల ముందు తలవంచుతూ, బేషరతుగా వారి సూచనలు పాటించే వ్యక్తులు తప్పనిసరిగా తమ లక్ష్యాలను చేరుకోవడం సులభమవుతుందని గమనించి ముందడుగు వేద్దాం, గురువు అడుగు జాడల్లో పయనిద్దాం.

"గురు బ్రహ్మ, గురు విష్ణు
గురు దేవో మహేశ్వరహ
గురు సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః"

(05 సెప్టెంబర్ 'జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం' సందర్భంగా)

\-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# మేడారం అడవుల్లో పెద్ద ఎత్తున గాలిదుమారం, సుడిగాలుల బీభత్సం

**-50వేలకు పైగా చెట్లు నేలమట్టం**

మేడారం సెప్టెంబర్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మేడారం అడవుల్లో సుడిగాలి బీభత్సం సృష్టించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో భారీ వృక్షాలు నేలమట్టమయ్యాయి. 200 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ అడవుల్లో పెద్ద ఎత్తున గాలిదుమారం, సుడిగాలులు బీభత్సం సృష్టించడంతో మహావృక్షాలు కిందకూలాయి. ఒకే చోట మూడు కిలోమీటర్ల విస్తీర్ణంలో 50 వేలకు పైగా చెట్లు నేలమట్టమయ్యాయి. ఈ నెల 1వ తేదీన పరిశీలనకు వెళ్లిన అధికారులు సుడిగాలి బీభత్సానికి చెట్లు కూలడం చూసి స్థానికులు ఉలిక్కిపడ్డారు. టోర్నడోల కారణంగానే ఈ చెట్లు కూలి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ వృక్షాలు కూడా నేలకు ఒరగడాన్ని బట్టి కనీసం గంటలకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వచ్చి ఉంటాయని తెలిపారు. అయితే 50 వేలకు పైగా చెట్లు కూలిపోవడంపై సమగ్ర విచారణ జరుపుతున్నామని అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

# డా॥ వద్దేపల్లికి జీవిత సాఫల్య పురస్కారం



ఆదివారం బంజారాహిల్స్ ఫిలింనగర్ కల్చరల్ క్లబ్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల సినీ రచయితల సంఘం త్రిదశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. డా॥ పరుచూరి గోపాలకృష్ణ అధ్యక్షత వహించగా ప్రసిద్ధ నిర్మాత డి. సురేశ్‌బాబు, మురళీమోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యదర్శి శ్రీమతి ఉమర్జీ అనురాధ నివేదిక సమర్పించి, వ్యాఖ్యానంతో డా॥ వద్దేపల్లి కృష్ణను వేదిక మీదికి ఆహ్వానించి, ఆడియో వీడియో ద్వారా ఆయన సినీ గీతాల ప్రత్యేకతల్ని- బహుముఖ ప్రజ్ఞల్ని వివరిస్తూ చిరకాలంగా సంఘానికి ఉపాధ్యక్షునిగా చేసిన సేవల్ని గుర్తిస్తూ జీవిత సాఫల్య పురస్కారాన్ని జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

# నేటి నిజం సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com

2 హైదరాబాద్    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    గురువారం 5-9-2024


## ఘంటారావం

పెంపకమంటే పిల్లల్ని
నియంత్రించడమనుకోకు
మానసికోద్వేగ
బంధమని మరువకు

ఉన్నస్థితినే ఉత్తమమైనదంటున్నారంటే
సాహస నిర్ణయాలకు సందేహిస్తున్నట్లే
పిరికిమందు నూరిపోస్తున్నారంటే
బరిలో నిలబడలేని భయస్థులన్నట్లే

నిర్ణయించేముందు
నిశితంగా పరిశీలించు
అననుకూల కారణాలను
అమూలాగ్రం చర్చించు


పోల్చుకుంటే
ప్రమాదం
పంచుకుంటే
ప్రమోదం



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## మాయాబజార్ !

గతమంటే జ్ఞాపకాల
శిలాజనిక్షేపాల గుట్టలోని
పాడుబడ్డ పాతప్రదేశమే !
అస్తిత్వం మరిచిపోకుండా
అప్పుడప్పుడు సందర్శనకు
మన భవిష్యత్ గమ్యస్థానం
చేరడానికి వెళ్లడానికేగానీ ,
స్తావరం చేసుకుంటేమాత్రం
క్షవరం చేస్తుంది జీవితాన్ని !
గతం నాస్తికాదు నేస్తమన్నా
అది జ్ఞాపకాలఆస్తి అనన్నా
సాంగత్యమెక్కువైతే మాత్రం
శ్వాసతో పుడ్చేసే స్మశానమే !
అందుకే గతంగత: అనేది !
గతమంటే జ్ఞాపకాలఇంటిలో
కదలనివ్వని పునాదిరాళ్ళు
ఆనవాళ్లు కనిపించకుండా
ఆత్మను నిశ్శబ్దంగా ముంచి
సమాధిచేసే మాయాబజార్ !



- డా. డి. రాజేశ్
9440460490



## ధ్వంసం- విధ్వంసం

యింతటి జలాగ్నిని
యిలాంటి ప్రళయాన్ని.
సంద్రంలా ఉప్పొంగిన దుఖాన్ని
నీరు నిప్పయి కాల్చిన వైనాన్ని
పైపైకి ఉరిమి వచ్చిన ఉప్పెనని
యింత వరకు చూసిన గుర్తులేదు.

యిది చాలదన్నట్టు
హైడ్రాస్త్రం దూసుకొచ్చింది
గగన భవనాలను
నేలకు దించింది.

ఒకటి ప్రకృతి విధ్వంసం
మరొకటి మానవ ధ్వంసం.
బూదిలో
ఒక నిప్పు రవ్వ చాలు
రాజకీయం రాజుకోవడానికి.
నాశనానికి ఏ అస్త్రమయితేనేం
నిర్మాణానికి ప్రణాళికలు కావాలిగాని.

కుర్చీ అదే
ఎక్కే వాళ్ళు మారుతుంటారు.
ఎక్కడి సమస్యలు అక్కడే
విపత్తు రాగానే హడావుడి
నష్టం అంచనాలు కోటానుకోట్లు
కొన్ని పులిహోర పొట్లాలు
మరి కొన్ని మంచినీళ్ళప్యాకెట్లు
అక్కడక్కడా శరణార్థుల శిబిరాలు
మాధ్యమాల్లో ఏలికల పళ్ళికిలింపులు
భుజాలమీది కండువాలతో
అన్నీ దులిపేసుకుంటారు.

సమస్యల మూలాలు
అలా మూలుగుతునే వుంటయి!!



-రమణ వెలమకన్ని
సెల్:9866015040

## నానోలు

మనసు
గుప్పెడు
భావాలు
గంపెడు.

ఓటరు
షూటరు
ఓటు
బుల్లెట్.


మద్యం
మత్తు
యువత
చిత్తు.

అహం
బలిసిందా
పతనం
తప్పదు.

అభిమానం
పెరిగిందా
జయం
తథ్యం.

పట్టుచీర
తళతళ
పట్టు పురుగు
విలవిల.

మనసు
ఒక్కటే
భావాలు
బోలెడు.



- బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991



## భాగ్య నగరం వరద నగరమా ! విశ్వమంతా విస్తుపోదా !

నింగి నేల నీటితో ఏకం !
నేల పై జనానికి శోకం !

వీధుల్లో కాల్వలు !
మనుషుల కంట ధారలు !

కట్టుకున్న మేడలు !
వరద కాల్వల వాడలు !

నీట మునిగితే
నిప్పుకంటే బాధ !

లోతట్టు ప్రాంతాలు !
వానకాలం బావులు !

కట్టడాల ప్రణాళిక చేసేదేవరో !
జలదిశలపారే వాస్తు దోషం కానరో!

ఇంత తెలివి ఉన్న మనిషి కదా!
నీరు పల్లమెరుగుట తెలియదా!

వాతావరణం ముందు హెచ్చరించినా
దశాబ్దాల పాలనలో జాగ్రత్తలు ఏవి!


అజాగ్రత్తలు మాటి మాటికా
పొంగే నీరు మన మాట వినునా!

వర్షం కాలం వస్తే మేలుకునుడు ఏడ్చుడు !
విశ్వ నగరంలో జల వికృతి ఆపమా !

భాగ్య నగరం వరద నగరమా?
విశ్వమంతా విస్తు పోదా?

నిజాం కాలపు నూరు చెరువుల జాడ ఏది!
కనుగుంటే నగరంలో వరద నాస్తి!


"హైడ్రా" పరుగులతో ఇక లోక క్షేమమే కదా!
అక్రమ కట్టడాలకు స్వస్తీ వాచకమే కదా !



- కందాళై రాఘవాచార్య
8790593638

## మానవత్వం, మనిషితత్వం తెలిపే కథలు..

పుస్తక సమీక్షలు



ప్రతులకు:
పెద్దింటి అశోక్
4-4-90/1, రెడ్డివాడ
సిరిసిల్లా-505 301
సెల్: 94416 72428

తెలంగాణ ప్రజా జీవనాడి, గుండె చప్పుడు పెద్దింటి అశోక్‌కుమార్. పేద వ్యవసాయ కుటుంబంలో పుట్టి, తన ఊరినే కథల కార్యశాలగా చేసికున్నారు. రెండున్నర దశాబ్దాలుగా తన కథల్లో, నవలలలో, నాటకాలలో తెలంగాణ సామాజిక చరిత్రను గ్రంథస్థం చేస్తున్నారు. వైవిధ్య కథా వస్తు వు- అది అందరి కన్నులకు గోచరం చేదయినా- మంచి శైలి, శిల్పం తన దైన అభివ్యక్తి ఈ రచయిత ప్రత్యేకత.

ఇంత వరకు 7 నవలలు 10 కథా సంకలనాలు, 5 నాటకాలుతో తెలంగాణ సాహిత్యాన్ని సుసంపన్నం చేసి, ఇటు తెలంగాణ, అటు ఆంధ్ర రాష్ట్రంలో పలు ప్రశంసలు పురస్కారాలు అందుకున్నారు. వలస బ్రతుకులు, ప్రపంచీకరణ, తర తరాలకీ మారుతోన్న మానవ విలువలు వీరి రచనల్లో అతి ప్రతిభావంతంగా ప్రకాశిస్తాయి. లెక్కల మాస్టారుగా విద్యార్థులనే కాదు, సమాజాన్ని కూడా తన సందేశాలతో ప్రభావితం చేస్తున్న ప్రతిభాశాలి పెద్దింటి అశోక్‌కుమార్. వీరి రచనలు ఇతర భారతీయ భాషల్లోకి మరియు ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి. వీరి నవల **'జిగిరి'** **'మేగ్నం ఓపస్'** అనవచ్చును. మనిషికి, జంతువుకి, అడవికి గల అవినాభావ సంబంధాన్ని చిత్రీకరించే ఈ నవల ఇతర భాషల్లోకి (తొమ్మిది తెలుగేతర భాషలు) అనువాదం కావటమే కాదు, ఆ భాషల్లో పునర్ముద్రణకు నోచుకోవటం రచయిత ప్రతిభకు గీటురాయి. అశోక్‌కుమార్ రచనలే కాదు, ప్రసంగాలు కూడా, తెలంగాణ భాష యాసలతో శ్రోతలను ఆకట్టుకుంటాయి.

ప్రస్తుత కథా సంపుటి **"విత్తనం"** తో 11 కథలున్నాయి. ఇవి 2017-2022 మధ్య కాలంలో పలు పత్రికల్లో ప్రచురించబడ్డాయి. కొన్ని కథలు వార్షిక కథా సంకలనాలలో కూడా ప్రచురించబడ్డాయి. సంపుటిలోని చివరి కథ **'విత్తనం'** ఒక ప్రముఖ పత్రిక నిర్వహించిన పోటీలో అత్యధిక పురస్కారం (లక్ష రూపాయలు) గెలుచుకుంది.

తెలంగాణ ప్రాంతంలో **'ఇడుపు కాయితం'** (విడాకుల పత్రం) అందరూ రాయరు. అశుభంగా పరిగణించటం వల్ల మోద్దైన చెట్టు కిందనో, గుట్ట మీదనో, ఊరికి దూరంగా ఉండి, కొందరు ప్రత్యేకమైన వ్యక్తులు మాత్రమే రాస్తారు. పురుషాధిక్య ప్రపంచంలో అక్కడా ఆడదానికి అన్యాయమే జరుగుతుంది. ఎన్నో ఇడుపు కాయితాలు రాసిన బాలయ్య, చంద్రకళకు జరుగబోతోన్న అన్యాయాన్ని ఎలా నిలవరిస్తాడో **'ఎకరం భూమి'** కథ చెబుతుంది. **'అస్తుల విలువ'** పెరగచ్చు. తగ్గచ్చు కాని మనిషి విలువ తగ్గొద్దు' అన్న ఉదాత్త సందేశం ఇస్తుంది ఈ కథ.

మానవత్వం, మతం-రెండూ ఒకే దారిలో నడుస్తున్నట్లు అవుపడుతుంది. కాని అది రైలు పట్టాల్లా దూరం నుంచి చూస్తే కలిసిపోయినట్లు అవుపించినా, నిజానికి అవి కలవవు. నేటి కాలంలో ప్రాంతీయ, కుల, మత తత్వాలు మనుషుల్ని ఎలా విడగడుతున్నాయో **'దూరం'** కథ చెబుతుంది. కథ ముగింపు వాక్యాల్లో ఇలా విడిపోతున్న సమాజం పట్ల రచయితకు కలిగే ఆర్తి, బాధ చదువరిని కదిలిస్తుంది.


బొడ్డు కోసి బిడ్డను ఈ ప్రపంచానికి పరిచయం చేసేది తల్లి. అందుకు సహకరించేది మంత్రసాని. కూతురు భాగ్యకు వైధవ్యం ప్రాప్తించింది. బొట్టు గాజులు తీసి వేసే సందర్భాన భాగ్యను కన్న పూలమ్మ, మంత్రసాని పోశవ్వ ఎంత కలత చెందుతారో 'ఉల్లి పూసలు' కథ చదివితే తెలుస్తుంది. పాలివాళ్ళు కులపోళ్ళు చివరకు బర్త లచ్చయ్యను కూడా ఎదిరించి పూలమ్మ తీసుకున్న నిర్ణయం ఏమిటో **'ఉల్లిపూసలు'** కథ చెబుతుంది. ఒక తల్లి పడే ఆవేదన (ఈ సందర్భంలో) కన్నులకు కట్టినట్లు చెప్పే ఈ కథలో వైధవ్య సమయాన తెలంగాణ ప్రాంత ప్రజ పాటించే ఆచారాలు, ఆ ఆచారాల్లోని అమానవీయతకు మనమూ చలించిపోతాము.

మనిషి ఆలోచనలు పరిసరాలు పరిస్థితులను బట్టి మారుతుంటాయి. రాత్రి పదిగంటలు, తప్పిపోయిన బస్సు. అందువల్ల ఆ చీకట్లో నాలుగు కిలోమీటర్ల కాలినడక తప్పనిసరి. అందునా జేబులో లక్ష రూపాయలు. ఇంతటి అసౌకర్య పరిస్థితుల్లో ఆయన తో నడవటానికి తోడు దొరికింది. వెంట ఉన్న డబ్బును కాజేయటానికి వెంట వస్తున్నాడేమో నన్న అనుమానం. భయం. తెల్లవార వస్తోంది. ఊరు దగ్గర పడుతున్నది. అవతల వాడి దగ్గర డబ్బు బంగారు గాజులు రింగు ఉందని తెలిసింది. మాటల సందర్భంలో తనకు తెలిసిన ఆడదాయి భర్త అతడని తెలిసింది. అతనిలో ఎక్కడ లేని తెగువ వచ్చింది. అంతే.. అవ తలి వాడిని ఎత్తి బావిలో పడేయటం జరిగింది. ఏ ఆగంతకుడి వల్ల తనకు ప్రమాదం వస్తుందని భయపడ్డాడో వాడే దోచుకోబడి చంపబడతాడు. ఊహించని మలుపు తిరిగిన కథకు పాఠకుడు నివ్వెరపోతాడు. నిశ్చేష్టుడవు తాడు. మనిషిలో కలిగే మానసిక పరిణామాలను చిత్రించిన తీరుకు బహుశా **'ఫ్రాయిడ్'** కూడా తెల్లబో తాడు. లెక్కలు బోధించే రచయిత అశోక్‌కుమార్ **'టూ గ్రేటర్ దాన్‌వన్'** అన్న సిద్ధాంతాన్ని వివరించిన తీరు అద్భుతం. కథనం అనుకోని మలు పులు తిరుగుతూ ముగిసినాక కాసేపటిదాకా పాఠకుడు తేరుకోలేడు.

కరోనా కష్టకాలంలో రాసిన **'ఆరడుగులు'** కథ రచయిత సామాజిక బాధ్యతను గుర్తుకు తెస్తుంది. నేటి రాజకీయాలు, ఉచితాలు, ప్రజోద్ధారణ పథకాలు వాటి డొల్లతనం మనుషుల ముఖ్యంగా పదవిలో ఉన్న వాళ్ళ స్పందన తీరును **'సహగమనం'** **'ఏకగ్రీవం'** కథలు వివరిస్తాయి.

ఊరికి చేసిన ఉపకారం పీనుక్కు చేసిన సింగారం, తీసుకునే జాగల తీసుకుని ఒత్తే జాగల ఒత్తుడు. పాము ఇసమంటికల్లు.జాలగాడు, ఎగిడిసిన కోతులు, ఊరు అగ్గి ఉడికింది. బోరెవోలె మొగడే పోయిండు. ఈ బొంత శింపులు నాకెందుకు- లాంటి తెలంగాణ పదాలు, సామెతలు, సందర్భానికి సహజత్వం చేకూర్చాయి.

ఉద్యోగ నిర్వహణలో తన మీద తానే రెఫరెండం పెట్టుకున్న ఈ రచయితకు సాహితీ సృజనలో ఏ "కితాబు'లు అఖ్ఖరలేదు. ఆయనకు ఆయనే సాటి. కథా మేటి పెద్దింటి.



- కూర చిదంబరం
సెల్: 8639338675

# అరణ్య దుఃఖానికి ఆత్మార్పణ

ముత్యం పక్కన కూర్చుంటే సముద్రం పక్కన కుర్చున్నట్లె ఉండేది. సామూహిక కంఠస్వరం విన్నట్లె ఉండేది. సహజమైన జీవాధార లోలోపలికి వెళుతున్నట్లె ఉండేది. ఒక్కొక్క మారు ఆయనను చూస్తే దుఃఖం పెల్లుబికినట్లు అగుపించేది. జీవన యుద్ధ నైపుణ్యం నేర్పుతున్నట్లు ఉండేది. ఎప్పుడు కలిసి మాట్లాడినా చెరువులోని చేపపిల్లతో సంభాషించినట్లు ఉండేది. పాపిష్టి రోగం పొట్టన పెట్టుకుంటుందని ఊహించనే లేదు. బతుకంతా పార్టైమ్ ఉద్యోగమేగా ! రోగం లాంటిదేగా! ఇంకెం చేస్తాడు! ఎన్ని కన్నీళ్ళు ఎదురైనా మడిమ తిప్పని అక్షరయోధుడు ముత్యమే. బతుకు పోరాటంలో నిశ్శబ్దంగా యుద్ధం చేసి చేసి అలసి పోయాడుగానీ సాహితీ సమరంలో మాత్రం తనవైన వ్యూహాలను, ప్రతి వ్యూహాలను, యుద్ధసామాగ్రిని ఇక్కడే వదిలి వెళ్లాడు.

పి డి ఎస్ యు కార్యకర్తగా ఉద్యమకారుడిగా నడిచినంత కాలం నడిచి ఎం. ఏ. తరువాత పరిశోధనలోకి,జీవిత చరిత్రలోకి, సాహిత్య సంకలనాల దారుల్లోకి ఎవరూ చేయని పనులు చేయడంతో ఆయనకున్న జీవితాన్నంత అర్పించుకున్నాడు. శాతవాహన విశ్వ విద్యాలయం లోకి ఎలా గెస్టు లెక్చరర్ గా వెళ్ళాడో పదవీ విరమణ దాక అలాగే ఎందుకున్నాడనే ప్రశ్న నన్ను ఎప్పుడు తొలుస్తూనే ఉంటుంది. అంతకు ముందుకూడ గెస్ట్ లెక్చరరేకదా! వెన్నంటి వున్న దుఃఖాన్ని సహచరి కాస్త నెత్తి నెత్తుకోక పోతే మరెంత కుంగి పోయేవాడో! ఐనా కుంగిపోలేదు. లొంగిపోలేదు. దారితప్పలేదు. ఎంత విషాద మున్నా వెన్నెల నవ్వినట్లె నవ్వేవాడు.

ముత్యం నేను డిగ్రీ నుంచే నిజామాబాదు నుండి చదువు కుంటూ వచ్చాం. చదువులో నాకన్నా ఒక సంవత్సరం జూనియర్ అయినా సాహిత్య శ్రమలో ముందుండే వాడు. అప్పుడే స్నేహితుల మయ్యాం. చదువుకునే రోజుల్లోనే నేనూ బెడిద రాజేశ్వర్, సలంద్ర, సి. హెచ్. మధు, బైస రామదాసు మరికొందరం ఇందూరు భారతి అనే సాహితీ సంస్థను వదిలి ప్రజాసాహితీ అనే మరో సాహిత్య సంస్థను ప్రారంభించుకునే సమయంలో అండగా ఉన్నవాడు ముత్యమే. ఆరెట్టి అనే మరో సాహితి వేత్త, గిరి నాగభూషణం, గాయకుడు శిర్ప లింగం, జర్నలిస్టు లింగం, గౌర్రెపాటి మాధవ రావు, కొంగర, జర్నలిస్టు గంగాధర్ లాంటి వారి సాన్నిహిత్యం ముత్యంకు ఎక్కువగా ఉండేది. సామూహిక క్రియలో ముత్యం అవగాహన స్ఫూర్తి నిచ్చేది.

ముత్యం ఎం. ఏ. లో అడుగు పెట్టిన తర్వాత మా యూనివర్సిటీలో రైటర్స్ సర్కిల్లో భాగమయ్యాడు. పి డి ఎస్ యు నాయకుడయ్యాడు. విద్యార్థి ఎన్నికల్లో అధ్యక్షుడయ్యాడు

చిందు ఎల్లమ్మ పై కృషి చేస్తున్న రోజుల్లోనే అర్సపల్లిలో ఎల్లమ్మ చిందు బాగోతం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర ముత్యందే. రాత్రి 8 గంటలకు బాగోతం ప్రారంభం. ఆరెట్టి ది అర్సపల్లే. ఆయన ఇంట్లో భోజనం చేసి బాగోతం చూడటానికి వెళ్ళాం. బాగోతం నగంలో అర్ధరాత్రి సమయంలో ముత్యం స్టేజి మీదికి వెళ్ళి చిందు ఎల్లమ్మతో ముఖాముఖి నడిపారు. ఆమే దుఃఖంతో మాట్లాడుతున్న సమయంలో ముత్యం నన్ను స్టేజి మీదికి పిలిచాడు. అన్నా ఎల్లమ్మతో సంభాషించు మంటె సరే నని ఎల్లమ్మ తల్లి! నీవు నటిస్తున్నప్పుడు పాత్రల్లో లీన మైనట్లే ప్రేక్షకులు నీ పాత్రల్లో లీనమవుతారు .నీవు పాత్రాభినయంలో ఏడ్చినట్లె ప్రేక్షకులు ఏడ్చేస్తారు. చిందు బాగోతం కళను రక్షించటానికి నీ భర్తకే స్వంత చెల్లెళ్ళ నిచ్చి పెళ్లి చేసావు గానీ నీలాగే నీ చెల్లెళ్ళు నటిస్తున్నారా? అని అడిగితే ఆమె యేమి చెప్పు మందువు కొడుకా! నటించే పాత్రల్లో వాళ్ళు లీనమైతే కదా! ప్రేక్షకులు ఆయాపాత్రల సుఖ దుఃఖాల్లో లీనమయ్యేది. చిందు బాగోతం కళను నా తరువాత వాళు ్ర బతికిస్తారని భావించి ,నా భర్తకే వాళ్ళనిచ్చి పెళ్ళిచేసానుగాని నా తర్వాత ఈ కళ నాతోనే మాయమై పొయెట్లుందని కన్నీళ్ళు పెట్టుకుంటే ముత్యం ఆవెను ఓదార్చి మళ్లీ బాగోతం ప్రదర్శించెట్లు చేసిన తీరు నాకిప్పటికీ జ్ఞాపకం. ఆవెకు స్వాంతన చేకూరే విధంగా మాట్లాడిన తీరు సాహిత్య కార్యకర్తకు చాల అవసరం అనేది ముత్యం ద్వారానే గ్రహించ గలిగాను.


ముత్యం నా ఎదుగుదలను కాంక్షించేవాడు. హైదరాబాదు ప్రగతి డిగ్రీ కాలేజీలో పనిచేసి నప్పుడు, శాతవాహన యూనివర్సిటీలో పనిచేసినప్పుడు నన్ను పిలిపించుకుని కవిత్వంపై ఉపన్యాసాలు పెట్టించాడు. సామెతలు సేకరిస్తున్నప్పుడు, సేకరించడంలో నా సహాయాన్ని అడిగాడు. నీదగ్గరకు అనేక పల్లెల విద్యార్థినీ విద్యార్థులు వస్తారు. వారిచేత ఎన్నయితే అన్ని సేకరించమన్నాడు. విద్యార్థులు ఎన్నెన్నో రాసుకు వచ్చారు. తనదగ్గర ఉన్నవాటిని తొలిగించి కొత్తవాటిని కొన్ని చేర్చాడు. ఆ పుస్తక ఆవిష్కరణలో మాట్లాడటానికి ఆహ్వానించాడు. ఇలా నాకెంతో గౌరవాన్ని తెచ్చిపెట్టాడు.

ముత్యం నేను ఆదర్శ వివాహం చేసుకున్న వారమే. ఎప్పుడు అనేవాడు అన్నా నీవు పడ్డన్ని కష్టాలు నేను పడలేదే అనేవాడు. నాకు మరింత దుఃఖం కలిగేది. ముత్యం నుంచి నేను నేర్చుకున్నది నిజాయితీ నిబద్ధత. హిపోక్రసీ లేనితనం. తనహృదయాన్ని విద్యార్థులకే అంకితం చేసుకున్న తీరు, జీవితాంతం స్నేహాన్ని వదులుకోక పోవడం. రాత్రనక పగలనక శ్రమించడం, నిరంతర పఠనం. అన్నిటికీ మించి తన నిబద్ధతను బలవంతంగా ఎదుటి వారిపై రుద్దక పోవడం నాకెంతో నచ్చేవి. అన్నా మనచుట్టే చెద ఉంటుంది. చెదపట్టిన పుస్తకాల లాగే మనం సేకరించిన దాన్ని పుస్తక రూపంలో తెచ్చే దాక ఎవరితోనూ చెప్పద్దు.మన శ్రమ తోనే కీర్తిని పొందుతారు. కనీసం కృతజ్ఞత కూడా ఉండదు. జాగ్రత్త అనేవాడు. అయితే ముత్యం శ్రమ వృధాకాదు. ఆయన పరిశోధనలు ముందు తరాలకు మార్గం చూపుతాయి. ముత్యం బంగోరే లాంటి వాడు. బ్రౌన్ ను స్ఫూర్తిగా పొందాడు. జీవితాన్ని ఉద్యమాలకు అర్పించి, తన సృజనను సాహిత్యానికి అర్పించి, భార్యకు కూతురికి నాలాంటి స్నేహితులకు దుఃఖాన్ని మిగిల్చి వెళ్లాడు. ముత్యం నాకొక అరణ్యం. ఆ అరణ్యాకి నా ఆత్మార్పణ.



-డా. నాళేశ్వరం శంకరం
9440451960

## డాక్టర్ ముత్యం అందించిన సేవలు చిరస్మరణీయం



డా॥ కె. ముత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్

తెలుగు సాహిత్య పరిశోధకుడు డాక్టర్ కె.ముత్యం శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటంపై వ్రాసిన సిద్ధాంత గ్రంథం చరిత్రలో స్థిరస్థాయిలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్ అన్నారు. దేవులపల్లి వెంకటేశ్వర్ రావు ఆనాడు రాసిన తెలంగాణ సాయుధ పోరాట పుస్తకం ఏ విధంగా చరిత్రలో నిలిచిపోయిందో శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట గ్రంథం కూడా అంతే స్థాయిలో చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఆదివారం నారాయణగూడలోని భారత్ విద్యాసంస్థల ఆడిటోరియంలో తెలుగు సాహిత్య పరిశోధకుడు డాక్టర్ కె.ముత్యం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు వక్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముత్యంపై రాసిన పరిశోధనా ముత్యం. మట్టి మనసుల కుంచే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ముత్యం బెనారసీ విశ్వ విద్యాలయంలో శ్రీకాకుళం ఉద్యమంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారని తెలిపారు.

శాతవాహన విశ్వ విద్యాలయం అధ్యాపకుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారన్నారు. మరుగున పడిన చరిత్రను వెలుగులోకి తెచ్చి అనేక పుస్తకాలు ప్రచురించారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి. శశిధర్ రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత కె. శివారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, జూలూరు గౌరీశంకర్, ప్రముఖ సాహితీవేత్త డా॥ నాళేశ్వరం శంకరం, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, తులా రాజేందర్ కుమార్, అపర్ణ ముత్యం, ప్రత్యూష, సుధాకర్, ప్రొఫెసర్ లింబాద్రి, డా॥ జె.డి. రమేశ్ , బండ్ల మాధవరావు, వేణుగోపాల్‌రెడ్డి, యస్. ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## దేశం ఎటు పోతున్నది?

అర విరిసిన అహింసా పూల పర్ణశాలను వీడి
నెత్తురు పారించే హింసా రాజ మహళ్ళ వైపుకి

దర్మ దీపం వెదజల్లే స్వచ్ఛ కాంతుల్ని కాదని
చిక్క బడుతున్న అధర్మపు చీకటి గుహల వైపుకి

న్యాయమనే ఉత్తుంగ శిఖరాల నుంచి జారి
లోతైన అన్యాయపు అగాధాల వైపుకి

కారుణ్యపు మెత్తని పొత్తిళ్ళ హాయి నుంచి
నిర్దయతా కసాయి కత్తుల బావుల వైపుకి

పరిమళించే మానవతా రహదారుల సౌఖ్యాన్ని విడిచి
దుర్గంధం వెదజల్లే అమానవీయ మురిక్కూపాల వైపుకి

శాంతి వనాల చల్లని నీడన సేద దీరడం నచ్చక
సంక్షుభిత కణకణ మంటల అశాంతి కాష్టాల వైపుకి


తృప్తినిచ్చే పచ్చదనపు పందిళ్ళ నొదిలి
కోరికల ఎండమావులు పంచే అసంతృప్తి అలసట వైపుకి

నైతిక విలువల అమృత ఫలాల్ని కాలదన్ని
పతనపు బురదలోని అనైతిక ఎంగిళ్ళ నేరుకొనే దుస్థితి వైపుకి

ఎవరి గెలుపునైనా అభినందించే సంస్కారపు సిరిని కాదని
ఈర్ష్యతో రగిలే కుసంస్కారపు దారిద్ర్యం వైపుకి

సముద్రపు సమూహంలోని కలివిడి బలాన్ని కాదనుకుని
సంకుచితతత్వపు ఒంటరి బొట్టై ఆవిరవడం వైపుకి

బదులేమీ ఆశించని చెట్టుతత్వపు ఆకాశపు టెత్తుల నుంచి
ఎదుటి వాడిని పడదోసి పకపకలాడే పాశవిక పాతాళంవైపుకి
నడక నుంచి.. వేగం పుంజుకుని పరుగెడుతున్నది దేశం!



- ఎస్. కాశింబి
సెల్: 9052216044

## కాలం ఓదార్పు

కదులుతున్న కాలానికి అలుపు తెలియదు
కరిగే పవలూ రేయికి అలుపు తెలియదు
వీచేగాలి,కురిసే వానలు ఎపుడూ అలసిపోవు
ఎగిరే పక్షులకునీట ఈదే చేపలూ అలసిపోవు.

మనిషి కష్టానికి కండలు కరుగుతాయి
బ్రతుకు భారానికి జవసత్వాలుడుగుతాయి
అలుపెరుగని ఊహలు మదిలో ఊరుతాయి
అనుభవాలు ఒకదానికొకటి జత చేరుతాయి.

మనిషి మనిషితో కలిసి మసలాలి
మనిషిమీద మనిషికి నమ్మకం కలగాలి
ఒకరోజుతో తీరేది కాదు ఏ బంధమూ
ప్రేమానురాగాలు పండాలి జీవితాంతమూ.

సృష్టిలో ఏ మనిషికా మనిషే ఒక చిత్రం
మనుషుల మనసులయితే బహు విచిత్రం
మనిషి జీవిత గమనంలో ఎన్నెన్నో మజిలీలు
మజిలీ మజిలీకి మనసెంతో నలిగిపోతుంది.

తరువు ఋతువులెన్ని చూసినా అలిసిపోదు
కొమ్మలతో రెమ్మలతో నీడని ఆశ్రయాన్నిస్తుంది
జీవితాన ఆశ నిరాశలు మారే ఋతువులే
కాలమే ఆలిసిన మనసులను ఓదారుస్తుంది




-డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి
9849331554



## జూపాక సుభద్రకు శ్రీ కళానికేతన్ పురస్కారం

జూపాక సుభద్రను సత్కరిస్తున్న డా॥ కె.వి.రమణాచారి. వేదికపై దైవజ్ఞశర్మ, ఆర్. అనంత పద్మనాభరావు, డా॥ శ్రీనివాస్‌రెడ్డి, కోయి కోటేశ్వరరావు తదితరులు.

కవయిత్రిగా, రచయిత్రిగా సమాజాన్ని ప్రభావితం చేసిన జూపాక సుభద్ర అభినందనీయురాలని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా॥ కే.వి.రమణాచారి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో శ్రీ కళానికేతన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 60 వసంతాల వజ్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవయిత్రి, వ్యాసకర్త, కాలమిస్టు, సంఘసేవకురాలు జూపాక సుభద్రకుకొసనం సుధాకర్ శ్రీ కళానికేతన్ సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు.రమణాచారి మాట్లాడుతూ సుభద్రనను సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆమె రచనలతోనే కాకుండా వృత్తిపరంగా మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. శ్రీ కళానికేతన్ ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్. అనంత పద్మనాభరావు, డా॥ శ్రీనివాస్‌రెడ్డి, కోయి కోటేశ్వరరావు, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.



## గురువు యాదిలో....

గురువు గురువు గురువు గురువు గుండె దరువు
గురువు యాది కొస్తేనే జ్ఞాపకాల దరువు
॥ గురువు ॥
చిన్ననాట తడబడిన అడుగుల సవ్వడి గురువు
గుండ్రటి అక్షరాలు దిద్దించి విజ్ఞానం అందించే గురువు
ఆటపాట మాటలతో చిందులేసిన గురువు
కండల్లో తిరుగుతుండు క్షణక్షణం మన గురువు
॥ గురువు ॥

అసాధ్యాలను సుసాధ్యం చేసిది గురువు
అందనంత విజయాలకు మమ్ము పంపి గురువు
తాను బడిలోనే ఉండి మురుస్తాడు గురువు
ఎన్నటికీ మరువలేని అక్షర సౌధం మన గురువు
॥ గురువు ॥
జిజ్ఞాసను పసిగట్టి విజ్ఞానం అందించి గురువు
వేలాది విద్యార్థులకు జ్ఞాన కెరటం గురువు
నిత్యం చిరునవ్వుల రేడుగా సాగేటి గురువు
నింగి నేల తడిమిన అరేయ్ ఒరేయ్ అని పిలిచేదే
మన గురువు ॥గురువు॥
జాతి కుల మతాలకతీతంగా పలుకరించు గురువు
నిండుకుండ వలె తొనకని రూపం గురువు
గురుపూజోత్సవ వందనం మీ పాదపద్మాలకు గురువు
మరువలేని మరుపురాని నిలువెత్తు శిల్పం మనగురువు
॥గురువు॥



-ఉండ్రాళ్ళ రాజేశం
9966946084




అమ్మలా లాలిస్తుంది
అందరినీ ఆహ్లాద పరుస్తుంది
అలసిన మనుషుల సేదదీరుస్తుంది
మనిషి మేధస్సుకు పదును పెడుతుంది
అందమైన ప్రకృతి ఆగ్రహిస్తే
మనిషి ఆపగలడా..
ఆపి మన గలడా..
మానవ తప్పిదాలకు
అభం శుభం తెలియని వారు బలి
మరునిమిషంలో ఏమి జరిగిందో
తెలుసుకునే లోపే
ఆక్రందనల హోరు?
కళ్ల ముందే
అయినవారు,కానివారు గల్లంతయితే
మనిషిగా మనం జీవించి ప్రయోజనం
నిస్సహాయులమై శిలలుగా మారితే
నిలువ నీడ కరువైన నిరుపేదల పరిస్థితేమిటి?
కంటికి కనబడని రోగం
పాఠాలెన్నో నేర్పి వెళ్లినా.?.
మానవత్వం మరుస్తున్న వైనం
నిప్పులు చెరిగే సూర్యుడ్ని సైతం
మింగేస్తాయి మబ్బులు
మీసాలనే కొమ్మలను తిప్పుతూ
గర్వంతో వీగే వృక్షాలు
కావలించుకుని ఉరిత్రాళ్లయితే..
గలగలల మృదంగనాద
జలం మృత్యుగంటయితే?
ఉవ్వెత్తున ఎగసి పడిన అలలు..
ఊళ్ళకు ఊళ్లే తుడిచిపెట్టుకుపోయిన పరిస్థితి..
మనుషులు, పశువులు రాత్రికి రాత్రే
శవాలైన తీరు..
ఊరు వాడ వల్లకాడయిన వైనం?
అందని ఆపన్నహస్తం?
గుక్కెడు నీటికై?..
పిడికెడు మెతుకులకై?
పసిబిడ్డల ఆకలి కేకలకై
ఆశగా చూసే జాలి చూపులకు
జవాబిచ్చే నాథుడేడి?
ప్రజల ఓట్లతో పట్టం కట్టించుకున్న రాజులేరి?
హంగులు,ఆర్భాటాలకై
చెరువుల,కుంటలు బంగ్లాలైతే
కాంక్రీటు మేడలు అడ్డుగోడలైతే
సాఫీగా,అందంగా పారాల్సిన ఏరులన్నీ
భూకబ్జాల పరమైతే ప్రకృతి ప్రకోపించదా..
జలం-జనం-అతలాకుతలమవ్వదా..
ఎవరు దీనికి బాధ్యులు...
మనం..మనం..జనమేగా?!
మనమే ఉంటే ఆ స్థితిలో?..
ఊహించడమే కష్టమే..
నవనాడులే ఉప్పొంగవా..!
తలరాతలు మార్చేది దేవుడు కాదు
మనమే..మనమే..మనమే!
ఇప్పటికైనా కళ్లు తెరుద్దాం!
జలాల ప్రకోపం ఆపుదాం.

-పురం మంగ
9440659444




వానదేవుని రుద్రరూపము
సామాన్య మానవుని గమనం ముంచివేసె
దినమహో రాత్రులు నిలవలేక
దివినుంచి పడుతూ చిందర చిచ్చులగుచు
ప్రళయకాలములయ్యె రగులుతున్నదయ్యె
కొట్టుమిట్టాడుతూ కొంపలే ముంచెను
ముసురులల్లి నిలిచి ముంచెనంట
ఆ.పుడమి నిండ నింపి పొంగుతూ నిలిచెను
వర్షధార తోని వరద లయ్యె
మనిషి జీవనంబు మాయజాల మగుచు
లోకమందు ముంచి రూపు దాల్చె
ఆ.పట్టు విడుపు లేక వర్షధార నిలిచి
భువిన జీవనంబు పూడ్చి నట్టి
నింగి నుండి వచ్చి నేలనే ముంచేసి
అసహనులను పూడ్చి పెట్టె
ఆ. పుడమి తల్లి నిండె పొదుగులో నిండెను
వర్ష మంత వచ్చి వడ్డనల్లి
దేవదేవులార ధీనవస్థను చూడు
లోక మందు నిలుము రుప కర్త

- వి. సంధ్యారాణి
9542299500




తిలాపాపం తలా పిడికెడు
వరదలతో వాగులు వంకలు గుండెల్ని ముంచెత్తే
కొంపాగోడు ప్రాణాలు
పిల్లల పుస్తకాలు యువత సర్టిఫికెట్స్ గంగలో
బురదలో మునిగే
వరుణుడి కబంధహస్తం కబళించే
తిండి తిప్పలు లేక అగ్గగ్గలాడే జనాలు
రైతన్నల హాహాకారాలు
భవిత గాఢాంధకారం
ప్రకృతిని వికృతంగా స్వార్థంతో
చీల్చి చెండాడే మనుషులూ!
బదలా తీర్చుకుంటూ వరుణుడు
సురసుర ఆకలిమంటలు
చలికి అల్లాడే పుట్టిన పసికందులు
నీతి నిజాయితీ గా
బాటలు ఆనకట్టలు భవంతులు కట్టడం
సాగించు
పక్షుల గూళ్లు పదిలం
తోటి మనుషుల స్వార్థం తో
బ్రతుకులు అతలాకుతలం

-అచ్యుతుని రాజ్యశ్రీ
8985035283




ప్రకృతి విలయం
స్తంభించిన జన జీవనం
ఆగమైతున్న బ్రతుకులు
ఆకలి దప్పుల ఆహాకారాలు
ఎటు చూసినా వరద బీభత్సం
బిక్కు బిక్కు మంటున్న ప్రజలు
ఆపన్న హస్తాలకై ఆశగాఎదురు చూపులు ..
వరుణ దేవా చాలు ఇక నీ ప్రతాపం..
ముసురుతో ముంచెత్తకు, విసురుగా రాకు,
కుంభవృష్టి తో కుదేలు చెయ్యకు
నదులు వాగులు వంకలు పొంగు తున్నయి
ఉర్లకు ఊర్లు కను మరుగవుతున్నయి
అగచాట్లు
పడుతున్న జనం
జాలి చూపలేవా ...ఇసుమంత
అపలేవ ఇకనైనా ...
అతలాకుతలం ఐతున్న బ్రతుకులు
ఆర్తనాదాలు వినబడటం లేదా..
పాడి పంటలకు భరోసా ఇచ్చే
నువ్వే ముంచేస్తే ఎలా ?
ఎందుకీ ప్రళయం? ఏమిటీ విలయం?
మానవ తప్పిదాలేన..
ఓ ప్రకృతి మాతా!
శరణార్థులం శరణు వేడుకుంటున్నం
మన్నించలేవ మాన్పలేవ ఈ గాయం అపవా
ఈ అతీ వృష్టి కాపాడవా ఈ సృష్టిని .

-శైలజ రాంపల్లి
9550258262.




నువ్వే జీవితం..
నీ చుట్టూనే నాగరికత...
కానీ నువ్వు కన్నెర్ర చేస్తే
కల్లోలం..కబంధం
అదేగా అనుభవిస్తున్నాం

నీ పరీవాహక దేహాన్ని కబళించిన
భూ కామాంధుల పీచమణచ
కన్నెర్ర చేసి జలకాళికవై
ఉన్న ఇళ్ళను
ఉన్నట్లుండి ఆక్రమించేసి
రాదారుల్ని గోదారి పాల్జేసి
పంట కాలువల్ని పయోనిధిగా మార్చి
ప్రచండాగ్రహాన్ని ప్రదర్శిస్తున్నావు...

నిండైన నీ నీటిపాత్రను
అశుభ్ర వ్యర్థాలతో నింపి
అస్తవ్యస్తపరిచిన వారిపై
తిరిగి వాటినే ఎగజిమ్మి..
చుట్టూ నీరున్నా తడారిపోతున్న
గొంతుకలను చూసి
వికటాట్టహాసం చేస్తున్నావు...

వారేవ్వా! నీ రిటార్ట్
అన్యాయాన్ని ఎదిరించే
సత్తాలేని మేము
అప్పుడు మాట్లాడలేదు
అందుకే ఈరోజు
నువ్వే మాట్లాడుతున్నావు
కోపాగ్నితో ఉప్పొంగుతున్నావు
ఇప్పుడూ మేము మాట్లాడలేము
దయదలచమని ప్రార్థించడం తప్ప...

- విశ్వైక
9550183143




పరాశక్తియే ప్రకృతి స్వరూపమని
తలచికొలిచి తరించువారం
ఉగ్ర శక్తి గా వికృత చేష్టలతో
ప్రాణికోటిని పరీక్షిస్తే
ఎవరు మోస్తారు వేదనా భారం?
కొండపై కొలువున్న కనకదుర్గమ్మ వినాలి
వేగంగా
విధివంచితుల ఆక్రోశం
అసహాయ ప్రాణుల పట్ల
ప్రకృతి తగ్గించుకోవాలి
ఆగ్రహావేశం
చూలింతలు బాలింతల్ని ఆదుకునేవారున్నా
సరిపోని అవసరాలు వేయింతలు
గత్యంతరం కానరాక జలాలు
జనవాసాల్ని ఆక్రమించడం
ప్రకృతి వైపరీత్యాలు జీర్ణించుకోలేని సత్యాలు
నీతిమాలిన మానవులకు
గుణపాఠం నేర్పడానికి
సృష్టికర్త ఎంచుకున్న
విధానమా ఈతిబాధలు!?

-గంగరాజు పద్మజ
8688807575

అక్షరయాన్
(Aksharayan TWWF)

ప్రకృతి మానవ మనుగడకు ప్రధాన ఆధారం. మానవులే కాదు, సమస్త జీవరాశి దాని సహజ వనరులను ఉపయోగించుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. అన్ని జీవులను అక్కున చేర్చుకొని కాపాడే ప్రకృతి ప్రకోపిస్తే.. మనిషి స్వార్థ పూరిత మనుగడను ప్రశ్నిస్తే..రెండు తెలుగు రాష్ట్రాలు వరదలకు అతలాకుతలమవుతున్న వేళ ఆ వరద బాధితులకు తమ అక్షర ఓదార్పును అందిస్తోంది అక్షరయాన్ ...

నిర్వహణ: విశ్వైక
95501 83143



నీ పాపాలు ఇప్పుడు నీ ముంగిట్లో నిలిచాయి.
అరణ్యాలు చింపి మానిన చెట్లకు,
గాలి కన్నీటి పిలుపు వినిపిస్తోంది.

నదులు కన్నీరు కారుస్తున్నాయి,
వాటి గుండెల్లో నీవు కలుష్యం నింపావు.
సముద్రాలు కోపంగా ఎగసిపడుతున్నాయి,
నీ వ్యర్థాలతో వాటిని కుదిపేశావు.

గాలి, నీటి లో హానికర గండాలు,
భూమి పై విరుచుకు పడుతున్న వాన మబ్బులు.
అప్పటివరకు సుకుమారమైన సూర్యుడు,
ఇప్పుడు తన కిరణాలతో మంటలలో వాడు.

ప్రకృతి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకుంటోంది,
అతివృష్టి, తుపానులు, భూకంపాలు.




మానవుడా, నీ స్వార్థం
నీ భవిష్యత్తును నాశనం చేస్తోంది,
ప్రకృతి ప్రతిస్పందన ఎంత ఘోరమో
నీవు అర్థం చేసుకో.

ప్రకృతి శక్తి అపారమైంది,
దానితో ఆటపట్టించు, అది నిన్ను శిక్షిస్తుంది.
నో
ప్రకృతిని ప్రేమించు, సంరక్షించు,
లేకపోతే నీవు నీ స్వహస్తాలతో
నీనాశనం రాయగలవు.

- డాక్టర్ లక్కరాజు నిర్మల
9949299618




ప్రకృతి అందరిది
ఆధునిక జీవన విధానం ఆధిపత్యాపు ముసుగేస్తే
సమస్త జీవరాసుల మరణానికి నాంది పలికినట్లే
పర్యావరణాన్ని విఘాతం కలిగించినట్లే
ప్రకృతికి మనిషికి బంధం తెగినట్లే.

పర్యావరణ పరిశుభ్రత పాఠించక
వనరుల దోపిడి చేస్తూ
ప్లాస్టిక్ వ్యర్థాలతో జీవనదులను కలుషితం చేసి
పంచభూతాల సంపదను వ్యర్థం చేసిన
వాతావరణ మార్పులతో ప్రకృతి అల్లకల్లోలమై
నదులు సముద్రాలు ఉగ్రరూపం దాల్చి
దేశం పై అతివృష్టి వానలు కురిపించును.

కుండపోత వానలతో వీధలన్నీ
జలదిగ్బంలో కూరుకుపోయి
రహదారలన్నీ నిండు కుండలా
చెరువులన్నీ సముద్రాలని తలపిస్తూ
సమస్త ప్రాణులకు విఘాతం కలిగించినట్లే.

వరదల్లో ప్రజల ఉనికి అస్తవ్యస్తం
పేద ప్రజల ఆస్తి నష్టం వాటిల్లి
అన్నదాతల పాడి పంటలు నీటిపాలై
కన్నీటిని మిగిల్చి
ప్రజల ఆకలి కేకలు వినిపించును.

పర్యావరణాన్ని పరి రక్షిద్దాం
ప్రకృతితో చేతులు కలుపుదాం
పంచభూలపై ఆధిపత్యపు
లి ముసుగును తొలగించి
తరతరాలకీ స్వచ్ఛమైన
ప్రాణ వాయువుని అందిద్దాం

-రాధ ఓడూరి
7893923966




మేఘం పగిలింది
ఎందుకో తెలియదు
చిద్రమైన బతుకుల్లోంచి
వరద ఉప్పొంగింది.
కన్నీరును ముంచేంత
ఇంత నీరు ఎక్కడిది
తేలిన శవాలు
ఒరిగిన పంటలు
రగిలిన ఉసురులు
పగటిని కమ్మిన చీకటి చీకటిని
కమ్మిన వాన
ఏకధారై
మింటికి కంటికి
ఆసువోస్తున్నది
పొలాలు రహదారులు
సంద్రాలై విర్రవీగుతున్నవి
అమాంతం మింగే కొండచిలువల్లా
చెరువులు దారిగాస్తున్నవి
ఏమిటీ విలయం
ఎందుకీ విలాపం
ఒంటి మీది
వస్త్రాలను విప్పేసుకుంటూ ఆకాశం
నగ్న నృత్యం చేస్తూ
వాన వలను విసురుతున్నది
గాయాలైన పల్లెలు మొండిచేతులుగా
బతుకులు
బిత్తర పోయిన పక్షులు
వాన గీసిన
చిందరవందర చిత్రం సరిచేయాలి
ప్రకృతి పగకు
శాంతి పాఠం పాడాలి
ఓ చెయ్యి
సాయం వైపు సాగాలి.

-డా.శారదాహన్మాండ్లు.
నిజామాబాద్.




ముంచెత్తిన వానలు
నిండుతున్న చెరువులు
పొంగుతున్న ఏరులు
మునుగుతున్న ఊరులు.

ఊరు వాడ కన్నీటి జలమాయే
వాగు వంకలు పొంగి పోరలాయే
గోదావరి ఉరమెత్తెను
కృష్ణమ్మ పరుగులెత్తేను
బుడమేరు ఉరిమింది
బెజవాడ ఒణుకింది
నక్క వాగు పొంగింది
జనమంత బిక్కు బిక్కు
మన్నారు కన్నీటి సంద్రం అయ్యారు
ముంచెత్తిన వానలు
ఆగకుండా కురిసెను
అతివృష్టిగా మారెను
విధ్వంసం సృష్టించెను
విలయతాండవమే ఆడెను
రాష్ట్రమంతా జల ప్రళయం
రహదారులు తెగిపోయి
రాకపోకలు ఆగిపోయి
ముంపు కింద గ్రామాలు
నీట మునిగి తేలియాడే.

చెట్టుకొకరు పుట్టకొకరు
గుట్ట కొకరు పరుగులాయి
గూడొదిలిన పక్షులైరి జనమంతా
గాలిలోన దీపమాయే
అరచేతిలోనే ప్రాణమాయే
ఊరు వాడ కన్నీటి జలమాయే
వాగు వంకలు పొంగిపొరలాయి
ప్రాణం నష్టమాయే పంట నష్టమాయే,
ఆహారం అందాలి
ఆవాసం అందాలి
ఆరోగ్యం చూడాలి
అక్కున చేర్చుకోవాలి
ప్రభుత్వ సాయం అందాలి
ఆర్థిక సాయం పొందాలి.
(ప్రకృతి ప్రకోపిస్తే ప్రళయమే తాండవ మాడే
మానవ మనుగడే కే నష్టం వచ్చే
అందని కోర్కెలుఅందుకున్న టెక్నాలజీ
అధ్వాన్న స్థితిలో ఉంచే )

-గాదేపల్లి సూర్యకాంతి
8328629202




మానవరూపాలను కప్పుకున్న
స్వార్థపు దేహాలు దాచుకున్న పదునైన
ఆయుధాలేవో..
పరి పరి విధాల
కన్నతల్లి దేహానికి గాయాలు చేస్తుంటే?
ఆధునికపు పోకడల మలాము కింద
ఆ దారుణాలను సమాధి చేస్తూ
ఆపై పూల గుచ్ఛాలను పెడుతుంటే.
గుండెల్లో దిగే గునపాలూ,
కళ్లలో కి దూసుకుపోయిన కడ్డీలూ
చిప్పిల్లిన అమ్మనెత్తురు
ఆకాసపు ఎత్తున ఎగిరినపుడు
అదే హద్దనుకుంటూ..
బహుళ అంతస్థుల భవనాలు నిర్మిస్తూ..
అర్హత విజ్ఞానం అందరాని
అందలాలు వెదుక్కుంటూ
పొరుగుదేశాలకు..ఎగిరిపోగా
అణకువెరుగని అజ్ఞానాలూ
అక్రమాలెరిగిన వాణిజ్యాలు
మన భవితను కర్వాచాంద్
లా కన్నాలలోంచి చూస్తూ.. కట్టేసిన
పేకమేడల్లాంటి ఆనకట్టలు?
ఆవేదనతో కట్టలు తెంచుకంటున్న నదీమతల్లుల
కన్నీటిని ఆపలేని క్షణాలు
ఈ ద్రోహాలకు తగిన రీతి దండించాల్సిందేనని
ప్రకృతిమాత వికృత క్రీడ ప్రారంభించి
పంచభూతాల సహకారంతో..విజృంభించి
కడలిఎదన నిద్రిస్తున్న
బడబాగ్నికొండను పగులగొట్టి
ఫెళ్లున ఉప్పెన కోటి కోరల కెరటాలై
భళ్లున ఊళ్లమీద కు దండెత్తిన నిముషాలు
కన్నబిడ్డల తప్పులు కోట్లకు చేరగా
సహనం కోల్పోయి కోపం వచ్చినా
కనుతెరవని పసికూనలూ నోరులేని పశు పక్షులూ
ఈ జనులతో కలిసి జీవిస్తున్నందుకు
విలవిల లాడుతూ..విడుస్తున్న ప్రాణాలు చూస్తూ
నిసహాయతతో ఆక్రోశిస్తున్న భూమాత.
ప్రజాసేవకు ప్రజాస్వామ్యానికి
జవాబుదారి గా పదవులందిన
ప్రభుత పరిపరివిధాల
పరుగులెత్తుతూ అందిస్తున్న చేయూత
రక్షించేందుకు చేస్తున్న యత్నాలూ
గాలిలో ఆహారపొట్లాలు?
గాలిలో కలుస్తున్న జీవితాలూ
గొంతువరకు వచ్చిన వరదనీటిలో కి
కంటినీరూ.కలిసి మట్టం పెంచుతుంటే
ఆపన్నహస్తం తమకెపుడు
అందునో అని ఎదురుచూపులు?
ఎవరికెవరూ మిగలక
ఎవరికెవరు మిగిలి ఉన్నారో తెలియక
బంధాలను వెదుకుతూ వేదనల
టార్చివెలుతురు లో
ఆవేదనల సుడిగుండాలలో..ఆత్మీయులు
ఎడబాటుతో రోదించి అలసిన హృదయాలతో?.
తెగినవి రోడ్లు మాత్రమేకాదు
అయినవారితో అనుబంధాలు కూడా
గండ్లు పడినవి చెరువులకే కాదు
కన్న తల్లి భూమాత కొనాశలకు కూడా
ఎన్నటికీ అతకని అగాధాలంత?.గండ్లు
ఎప్పటికీ పూడ్చలేనంత లోతైన కడగండ్లు
ఓర్పు ఓదార్పు, క్షమ..సంక్షేమ భావాలన్నిటినీ
అమ్మ ఒక్క లిప్త పాటున..వదలడం
ఎంతటి విపత్కరమో..మరెంత ఆపత్కరమో
ఈ ఆగ్రహపు చేష్ట వలన తెలుసుకుని
కూచున్న కొమ్మని నరుక్కునే మూర్ఖత్వం
కూడు పెట్టె అమ్మను
కుళ్లబొడిచే స్వార్థం వదలుకుని
క్లిష్టమైన ఈ సమయాన కష్టాలలో ఉన్న
సాటి మానవులకు సహాయం అందిస్తూ
పరిరక్షించే ప్రభుత చేతలకు చేయూతనిస్తూ
ఇకనైనా నడచుకుందాం మనుషత్వంతో
మానవులుగా?

-డా.కోడూరు సుమనశ్రీ
9490401968

## గజల్

ప్రకృతిలోని సమతుల్యత నశించెనని తెలిసెనుగా
మానవాళి మనుగడయే అసాధ్యమని తెలిసెనుగా.
స్వార్థబుద్ధి పెచ్చుపెరిగి జలవనరులు ఆక్రమించ
కలతపడ్డ పుడమితల్లి శాపమిదని తెలిసెనుగా.
వాగువంక పొంగిపొర్లి వరదనీరు ముంచెత్తగ
ప్రకృతియిలా వికృతివలె మారినదని తెలిసెనుగా.
గండిపడిన చెరువులన్ని ఉప్పొంగీ ప్రవహించగ
జీవనమే నీటిబుడగ వంటిదియని తెలిసెనుగా.
తినడానికి తిండిలేక కట్టుకొనగ బట్టలేక
ప్రాణభీతి కలిగించిన ప్రళయమిదని తెలిసెనుగా.
రహదారులు తెగిపోతూ రాకపోక నిలిచిపోగ
పోటెత్తిన నీటికెంత బలముందని తెలిసెనుగా.
వంతెనలే కుప్పకూలి వాననీరు విజృంభించ
మనిషిజన్మ మూడునాళ్ళ ముచ్చటయని తెలిసెనుగా.
వర్షములో చిక్కుకున్న వాహనాలు మునకలేయ
జీవనమే రెప్పపాటు కాలముయని తెలిసెనుగా.
పంటన్ని నేలకొరిగి తల్లడిల్లు శ్రమజీవులు
ఆశలన్ని ఆవిరియై పోయినవని తెలిసెనుగా.
గతితప్పిన ఋతువులతో బ్రతుకులన్ని భారమవగ
ప్రకృతిహితము అందరికీ అవసరమని తెలిసెనుగా.
ప్రకృతినేర్పు పాఠాలను తెలుసుకుంటు మసలుకుంటె
ఓజమునా విశ్వజగతి శుభకరమని తెలిసెనుగా.

-పులి జమున
8500169682.




కట్టుబట్టలతో కొంపా గోడు వదిలేసి
పునరావాసకేంద్రాలకి
తరలివెళ్తున్న జనాల గోడు వింటున్నారా
బడా బాబుల్లారా
ఇదెవరితప్పు? ప్రకృతిదా లేక వాగులు వంకలు
చెరువులు పూడ్చేసి
ఫామ్ హౌస్ లు కట్టుకున్న పెద్దలదా?
సామాన్యులు నిలువనీడలేక చలికి వణుకుతూ..
విలవిల్లాడుతున్నారే, మీకళ్లకు కనిపించడంలేదా?
మీవిలాసాల్లో మీరు మునిగితేలుతున్నారేగాని
సామాన్యులబాధలు పట్టించుకోరా?
పిడికెడు అన్నంలేక జనాలు అల్లాడుతుంటే
వారి ఆక్రందనలు వినిపించడంలేదా?
ఇకనైనా మనుషుల్లా మారండి,
తోటివారికి సాయపడండి.
ఇసుకను తవ్వేసి మట్టిని మెక్కేసి చెట్లు నరికేసిన
భవంతులుకట్టుకున్నందుకు
ప్రకృతి పగబట్టి అతివృష్టి అనావృష్టితో
సామాన్యుల జీవితాలు తల్లడిల్లుతున్నాయి
మేడలు మిద్దెలు ఫామ్ హౌస్ లు కట్టుకోవడం
మీతప్పు కాదని మీరనుకొంటే,
ప్రకృతికి మండి నాప్రదేశంలో
ఎవరినీ ఉండనివ్వనని విలయతాండవం చేస్తోంది.
ఇపుడైనా ప్రభుత్వాలు మేల్కొని
చెరువులను వాగు వంకలను
ఆక్రమణల చెరనుండి కాపాడాలి,
అపుడే ప్రకృతి సమతుల్యత ఉంటుంది.
అతివృష్టి అనావృష్టి నుండి బయటపడవచ్చు.
సర్వేజనా సుఖినోభవంతు అన్న పదానికి
అర్థం పరమార్థం..!

-డి. ఎం? అనలకుమారి 8639832773




ఆశకు అంతు లేకుండా,
అత్యాశకు పోయి,
అందిన స్థలాలను అందినట్లే ఆక్రమించే....
భూ బకాసురుల్లారా!
చెరువులను, కాలువలనీ మూసేసి,
భవంతులు కట్టేసే
రియల్ ఎస్టేట్ వ్యాపారులారా!.
లంచాలు మరిగి,
ప్లాన్లు పరిశీలించకుండా,
అనుమతులిచ్చే
అధికారులారా!
మీరంతా...మీ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తుంటే...
ప్రకృతి ఊరుకుంటుందనుకుంటున్నారా...
తన ప్రతాపంతో విరుచుకుపడితే..
బాధలు పడుతోందెవరు..
మీ దురాశకు ఫలితం అనుభవిస్తున్న ఆభాగ్యుల
ఉసురు మీకు తగలదా...
కొంపా గోడు లేక, పసిబిడ్డలతో, వర్షంలో
కన్నీరు మున్నీరవుతూ...
అల్లాడుతున్న వారి శాపాలు మీకు తగలవా??
ఆలోచించండి!!!
ఇకనైనా మారండి!!!
మీ ఆశలకు ఆనకట్ట వేయండి.
ప్రకృతిని శాంతింపజేయండి.
అంతే చాలు!!!చాలు!!!

-వాడపల్లి రాధ,
9032044635




ఎటు చూసినా ఆర్తనాదమే
ఆదుకోమనే హాహాకారమే
ఎంతటి విషాదకరమైనది ఈ ప్రకృతి ప్రకోపం!
కళ్ళపై కన్నీరు కూడా కనపడనీయనంతటి
వరద బీభత్సం!
కాలమే కాదు...
కారుణ్యం కూడా వేగంగా పయనించాల్సిన
తరుణమిది!
సానుభూతి మాత్రమే కాదు,
తమదైన కాస్తో కూస్తో సహకారం కూడా
సాగాల్సిన సమయమిది.
ఎన్నో ప్రాణాలు వరదల్లో కొట్టుకుపోతున్నాయి!
మరెన్నో బాధిత హృదయాలు బద్దలై
పోతున్నాయి!
ఎన్నిసార్లు ఎదుర్కొంటాం?
ఇంకా ఈ విపత్తుల వినాశనం!
సమస్య దిశగా ఆలోచించినప్పుడు
ఆచరణ దిశగా అడుగులు వేసినప్పుడు
ప్రకృతి రక్షణే ధ్యేయంగా
ప్రతి మనిషి సాగినప్పుడు కదా,
ఈ విపత్తులని
కనీసం
దీర్ఘకాలంలోనైనా మనం ఆపగలం!
మన ముందు తరాల కైనా ఈ బాధని
తప్పించగలం!
తరతరాలకి ఆస్తులనే కాదు,
తరతరాలకి పర్యావరణ సిరులని కూడా
కూడపెడుదాం!
ప్లాస్టిక్ వ్యర్థాలు .,
అక్రమ నిర్మాణాలు
పెరిగిపోనీయకుండా ..
అడవుల సంరక్షణ చర్యలు తగ్గించకుండా,
ప్రకృతి సంరక్షణ దిశగా
సాగే అడుగులు సన్నగిల్లకుండా ,,
మన బతుకు సాగినప్పుడు కదా.,
ప్రకృతి ప్రకోపాన్ని
మనం శాంతపరచగలం!

-టి.కిరణ్మయి, నిర్మల్




అమ్మా! జల దేవత, ఏలా! కరుణ లేదు
వర్షమా! ఆధారమా! ఆపదలా! ఆగడమా !
ఈ రీతి వణికించెదవు! నీ గంభీర గగన
చతురతలు, భయంకర మృదంగం
డమరుక నినాదాలు ముంచెత్తి గుండె లదరా!

ఏలా ఈరీతీ కంకణము కట్టితివి
ఏమి పాపము చేసితిమి దయ చూపవా
కారుణ్య మూర్తులే ,కమనీయ స్వరూపులే
విలయ తాండవము అతి భయంకర

విన్యాసాలు అపర రుద్రుని చందమున
కారణమేమి తెలియలేదే, అమాయకులము
కడగండ్లలో, కన్నీటిలో ,మునకలే, ఎక్కడమ్మా
దయ, ఎక్కడమ్మా కరుణ లేసెమైనా లేదా

ప్రేమ వర్షించు నీవు కఠిన బీభత్సాల
అద్దడిలో, గూడు చెదిరిన, పక్షుల
ఆదుకొను హస్తమా! నీవీ రీతి, మారుట
న్యాయమా! దయ చూపవా!

-కె.కె.తాయారు
9440460797




వర్షం వస్తే ,దానిని చూడగానే,
రావాల్సిందిహర్షం.
వయ్యారాల జలప్రవాహంతో
ఆడుకోవాలనే ఉబలాటం.
కానీ,
నేడు ఎటుచూసినా ఆక్రోశం,
ఆర్తనాదం,ఆవేదన,రోదన.
కారణం...చేసుకున్నవానికి
చేసుకున్నంత మహాదేవా నా? కాదు గాక,కాదు.
ఎవరో చేసిన పాపాలు,
మరెవరికో శాపాలా?
డబ్బు సంపాదనే ధ్యేయంగా
బతుకేస్తున్నా పెద్దమనుషుల జబ్బులకు,పేదవారు
బలి అవుతున్నారు,
ప్రకృతి ప్రకోపానికి గురి అవుతున్నారు.
×మట్టి× వాసనను మరిచిపోయి,
×మని× వాసన ఒంటబట్టించుకుని,
బంగారు భూమిని కాంక్రీట్ నేలగా మార్చేసి,
విల్లాలు,అపార్ట్ మెంట్ లు,
అనుకుంటు,అందిందల్లా దోచేసి,అత్యాధునిక
హంగులు గా మార్చేసి,
బురద అంటితే పాప మన్నట్టు,
మట్టి ఇళ్ళు శాపమన్నట్టుగా
తన మైండ్ సెట్ ను మార్చుకున్న మనిషికి ఇంకా
ఎప్పుడు అర్థం అవుతుంది ప్రకృతి భాష?
ముద్దుగా చెబితే వినే రకమా మనము?
అందుకే ప్రకృతమ్మ మధ్య మధ్యనా కొరడా
ఝుళిపిస్తోంది,మనల్ని మారమని హెచ్చరిస్తోంది.
తీసుకున్నది నాది
నాకు తిరిగి ఇచ్చేయమని అడుగుతున్నాది,
లేకపోతే పరిణామం ఇలాగే
ఉంటుందని మరీమరీ
బుగ్గ గిల్లి చెబుతోంది
మన తల్లి,మనబాగుగోరి.
ఇప్పటికైనా మించిపోయింది లేదు.
చెరువులను వదిలేద్దాం,
దోచాలని చూసే తిమింగిలాలను తరిమేద్దాం.
మట్టి నేలలను మన భాగస్వామ్యం చేద్దాం,
పర్యావరణపరిరక్షణకై దీక్ష బూని,సాగుదాం.
అందరం అందరికోసం.ఏమంటారు?

-సుమతి సారంగపూర్కర్
8639125198

(3వ పేజీ తరువాయి...)




మూడు రోజుల ముదనష్టపు వాన
ఆరుగాలం పడ్డ కష్టం ఆగం జేసింది!!
ఏటి గట్టున ఎడ్లపాక లో నడుములలోతుకు
నీరొచ్చి ఎండుగడ్డి యాన్నో మేట వేసింది!!

అయినా అధైర్య పడకు పటేలా(భర్త) నేనున్నాగా
ఉతికిన నీ పంచెలు మంచె అంచుకు ఆరబెట్టిన!!

గోడంచుకున్న అరటిచెట్టుపువ్వు తో ఆవపెట్టిన
ఆవు జాడ జప్పునదొరకాలని ముడుపు కట్టిన!!

వరదనీల్లు ఎల్లదీసి,బురదంతా ఎత్తిపోసి
ఇల్లు సాపు జేసి ,నీకై ఎదురుచూసిన!!

-సాధన.తేరాల
సెల్:7036792969

## ప్రకృతి విలయతాండవం

పంచభూతాలలో ఒకటైన నీరు
ప్రజలకు తెప్పిస్తుంది కన్నీరు
ఇది జలప్రళయమా!
ప్రకృతి విలయతాండవమా!
అయోమయంలో జనం
పల్లెలు,పట్నాలు ఏకమైన తీరు
పంటలు కూడా నీటిమయం
తంటాలు పడుతున్న రైతులు
వరద బీభత్సంతో
అతలాకుతలం
అంతటా నీరే
అంతరంగంలో కూడా నీరే
పుడమిని కనపడకుండా
చేసిన వర్షాలు
ఎటు చూసిన వింత దృశ్యాలు
కూలిన వంతెనలు
పొంగిపొర్లుతున్న నదులు
ఆకాశగంగ భువి పైకి వచ్చినట్లుగా
కుప్పకూలిన బంగళాలు
తిప్పలు తప్పవంటూ
బోరున విలపిస్తున్న జనాలు
ప్రకృతిని మనం చులకనతో చూస్తే
పరిస్థితులు ఇలాగే ఉంటాయి
మరి
దిక్కుతోచని స్థితిలో గగ్గోలు
పెడుతున్న జనం
బాధాతప్త హృదయాలతో
విలపిస్తున్న వైనం
ఇది శాపమా!
మన పాపమా!
అర్థం కాని,విపత్కర పరిస్థితి
గందరగోళ దుస్థితి.

-స్వర్ణ సమత
9963130856




రానే వచ్చింది ప్రకృతికి కోపం
ఇప్పుడు సానుభూతి పర్వం
మొదలయింది.
అయ్యో అయ్యయ్యో అన్నా
అన్నన్నా అన్నా ఒరిగేదేమీ లేదు.
ప్రకృతిని, ఉన్నది ఉన్నట్టుగా
ఆస్వాదించడం చేతకాక,
ఆనందాలను పంచడం చేతకాక
అహంభావంతో నా అంతటి వాడు లేడంటూ,
నాట్య మయూరిగా నర్తించే
వానమ్మను,నవ్వుల హరివిల్లును
గమనించే తీరిక
లేని మనం,
ఆకాశాన్ని తాకే కోరికల వలయాన్ని నిర్మించుకుని
అందులో ఉక్కిరిబిక్కిరి అవుతూ హద్దులను
చెరిపేసుకుంటూ,నేనంటే,నేనంటూ
ప్రకృతి సమతుల్యాన్ని పాడు చేసుకున్నందుకు,
అపరకాళికలా విజృంభించిన
వానమ్మను చూస్తూ భయంతో
గజగజలాడాల్సిన దుస్తుతి తెచ్చుకున్నందుకు,
ఒకరిపట్ల ఒకరికి ఉండాల్సిన
ఆప్యాయతను అహంభావంతో
అణచివేసుకున్నందుకు అనుభవించాల్సిందేమరి.
అయ్యో పాపం అంటూ గద్దె
మీద కూర్చున్న వారి సానుభూతి,
ముందే రుతుచక్రం
పై చూపించి ఉంటే బాగుండేది.
అయినా వానమ్మ
పాపం జనం అనే సంయమనం
పాటించకపోదు.
వేచి చూడాల్సిందే.రేపనే రోజు
మరి తియ్యనైనదే కదా!

-శారద పొట్లూరి
9912433735

## ప్రళయం

వాతావరణ కాలుష్యంతో
ప్రకృతి ప్రకోపించే
మేఘాలు ఉరిమి గర్జించే
జోరు జోరున వానొచ్చే
నదులన్నీ పొంగి వరదొచ్చే
ఊళ్ళని జలమయమయ్యే
పంటలన్నీ మునిగిపాయే
జనం అతలకుతల మాయే
ఎందరో నీట మునిగి
ప్రాణాలు గాలిలో కలిసిపాయే
రైలు పట్టాలు విరిగిపాయే
వంతెనలు వంగిపాయే
రోడ్లన్నీ ధ్వంసమై పోయే
ప్రయాణ రాకపోకలు ఆగిపోయే
ఆదుకొనే నాథుడే కరువాయే
చెట్లన్నీ నేల వాలిపోయే
కరెంటు స్తంభాలు కూలీ పాయే
ఎందరో బ్రతుకులు చీకటాయే
నీటమునిగి జనం అల్లాడి పాయె
కొందరికి తిండి కరువాయే
కొందరేమో సర్వస్వం కోల్పోయే
గుండెలో గుబులాయే
దిక్కు తోచక ఆపన్న హస్తం కోసం
ఎదురు చూపాయే
గోదారమ్మ మా గోడు వినుమా
కృష్ణమ్మ మాపై దయ
చూపుమా
కావేరి మా భాద కనుమా
కరుణించు వాన దేవా కనికరం
లేదా నీకు
చిరు చిరు జల్లులా కురిసి
చిద్విలాసం చేయమ్మా
ప్రళయమై ప్రాణాలు హరించకుమా

-సిహెచ్ వరలక్ష్మి
8897927948




ప్రకృతితో చెలగాటం
నామరూపాల్లేకుండా
ఉన్నపెట్టున ఊడ్చేస్తూ
జనజీవనం స్తంభింప చేసిన
వానతాకిడి..
అందాలమెక్కిన మనిషి
చేష్టలుడిగి చూడటమైంది?
పల్లె పట్టణం
కొండా కోనా
ఊరూ వాడా
చెట్టూ పుట్టా
గొడ్లూ గోదా
పంటలు కుంటలు
వాగులు వంకలు
అతలాకుతలం
అంతా జలమయం.
కూలిన వంతెనలు
తేలిన వాహనాలు
మునిగిన మనుషులు
వన్య ప్రాణుల అవస్థలు
చెప్పనలవి కాదుబి
అంతా జలమయం
తెగిన పట్టాలు
ఒరిగిన భవనాలు
విరిగిన చెట్లూ
అంతా జలమయం
ఎడతెగని వానలకు
ఎదలన్నీ బుగులు బుగులు
అభం శుభం ఎరుగక
రెక్కాడితే డొక్కాడని
బడుగు బలహీన
బ్రతుకులు అధోగతి.
ఏపుగా పెరిగి
చేతికి వచ్చు పంట
జలపిడుగుకు బలి కాగ
రైతన్న గుండాగేకాలం
అంతా జలమయం
వరద తాకిడికి
రస్థాలకు గండ్లుపడి
వచ్చి పోయే
రాక పోకలు రద్దు
పాలుపోక
ఆగమైన ఆబాలగోపాలం
చేసిన పాపం
తలా కొంచం
పంచితివి
ఈ చెంపపెట్టు చాలు
నీ బీభత్సవం
తగ్గించిబి
కరుణించు
వరుణ దేవా!!!

-రామగిరి సుజాత
9494050326




స్వార్థ చింతనతో ప్రకృతినే శాసించే
ప్రకృతి ఒడిలో సేద తీర్చాల్సిన మనిషి మృగమై
గ్లోబల్ వార్మింగ్ లెక్కచేయక
అహం పెరిగి వ్యవహారించే
అనాగరిక సమాజంలోను
ప్రకృతిని పూజించే
అతివృష్టి అనావృష్టితో మనిషి ఎంత సంపదలున్నా
నిరాశ్రయులై అలమటించే
కూడు గూడు లేని పేదలకు
మానవత్వం చూపి ఆదుకోవాలి
కరోనా క్లిష్ట పరిస్థితుల్లో
మనం చవిచూసిన చేదును
గుర్తించి మసలుకో
నేడు ఇరురాష్ట్రాలు రాజకీయపార్టీలు అతీతంగా
సేవలందించాలని కోరుతూ
మానవతా దృక్పథంతో విరాళాలు అందిస్తున్న
సిని . వ్యాపార సంస్థలకు
ధన్యవాదములు తెల్పుతూ
మానవుడే మహనీయుడని
మేధస్సుకు విర్రవీగే
సృష్టికి ప్రతి సృష్టి చేసే
కృత్రిమ మేధస్సుకు ఫలితం
అనుభవించక తప్పదు
ప్రకృతి ప్రకోపానికి గురైన
ఐకమత్యం తో జాతి ఏకమై నడవాలి
గ్లోబల్ వార్మింగ్ అనర్థాలకు
కలిసికట్టుగా కృషి చేయాలని
ఎంతటి తీవ్ర నిర్ణయాలకైన
కట్టుబడి యావత్తు ప్రపంచం నడుం బిగించాలి
భావి తరాలకు స్వచ్ఛ పంచభూతాలు
సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ..

-పూల ఉమాదేవి
7901385636

## నాకు అన్నం కావాలి

నడుస్తున్నాయి నా కాళ్ళు
గమ్యం ఎరుగక, ఆగడం కుదరక
సాగే కాళ్లకు కొట్టుకొచ్చిన శవాలు తగులుతూ ఆల్విదా చెప్తున్నాయి
ఒకప్పుడు దారిలో శవాన్ని తీసుకుపోతూ కనిపిస్తే
భయంగా తల తిప్పుకొనే నేను ఇప్పుడు
తగులుతున్నది పసిపాప విగత శరీరం అని తెలిసినా
పట్టించుకోకుండా ముందుకు పోతున్నాను
నిన్నటిదాకా తడారిన గొంతు తడుపు కోడానికి
గుక్కెడు నీరు దొరక్క మైళ్లదూరం నడిచిన నేను
వరద వుధృతినుండి దూరంగా పోయేందుకు మరిన్ని
మైళ్లదూరం నడుస్తున్నా ను.
పెనిమిటి కళ్ల ముందే కొట్టుకు పోయినా,
పిల్లలు ఉన్నారో పోయా రో తెలియకున్నా
కారే కన్నీరు వాన నీటితో కలిసి ముఖం కడిగేస్తున్నా
ఆకలితో అల్లాడుతున్న కడుపుకు గుక్కెడు మెతుకులు పెట్టాలని
చురచరా సాగే యత్నం చేస్తున్నాను.
మూడు రోజుల నుండి మొర్రోమని ఏడుస్తూ ఉన్న
కడుపుకి మూడు ముద్దలు పడితేనే కదా వరదల్లో కొట్టుకు పోయిన ,
సొంతవారిని గూర్చి,ఇంటి సామానులను గూర్చి రోధించే శక్తి వచ్చేది
రేపటిని గూర్చి యోచించి కష్టించే సామర్థ్యం లభ్యం అయ్యేది
అంత దాకా వణుకుతూ తడిసి ముద్దైన బట్టలతో నడుస్తూ.
ఆకలి తీర్చే వారిని వెతుక్కుంటూ
అడుగులేయడమే ప్రస్తుతం నా లక్ష్యం
పిడికెడు మెతుకుల కోసం
నాలాగ అటు మూగే వారిని చేధించుకుంటూ
నాలుగు ముద్దలు దక్కించుకుని ప్రాణం నిలుపుకోడం ధ్యేయం

-డా. గురజాడ శోభా పేరిందేవి




మింటికి మంటికి
ఏకధారగా కుంభవృష్టి
నిరంతర జడివానతో ఉప్పొంగిన
చెరువులు నగరాన్నే ముంచేసేలా!
ఇంట్లోకి రావాల్సిన నీళ్లు
ఇంటి బయటికి వరద వెల్లువెత్తి
చెరువుగా మారిన ఇళ్లు...
ద్వీపకల్పంలా మారిన ఇళ్లల్లో
దీనంగా బిక్కుబిక్కుమంటూ ప్రజలు
పునరావాసానికై ఉన్నపళంగా
గూడు వదిలిన పక్షులై!
అరణ్యాలను అంతం చేయుటతో
అతివృష్టితో అంతా అస్తవ్యస్తమై...
అత్యవసరాలకు బయటకు
అడుగు పెట్టలేక...
చిమ్మచీకటిలో పసిపిల్లలతో
అవస్థలు పడుతూ...
అల్లకల్లోలమై,
అతలాకుతలమైన జనజీవనం!
కాలువలపై కట్టిన ఇళ్లు
నీటి ప్రవాహానికి అడ్డంగా నిలిచి...
భూమిలోకి నీరింకే దారి లేక
ఇళ్లలోకి చేరిన మురుగునీటి వరదలు...
కళ్ళముందే కూలే గోడలు
కొట్టుకుపోతున్న ప్రాణాలు!
చేతికొచ్చిన పంటలు నీటిపాలౌతూ
ఉప్పొంగే జలాలు
ఉప్పుసముద్రం పాలౌతూ
అనావృష్టి ఎదురైతే కన్నీటిపాలౌతూ
ఏళ్లనాటి నీటిపారుదల వ్యవస్థలు...
కోటికి పైగా జనాభాకు
ఉక్కిరిబిక్కిరౌతూ!
అభివృద్ధి పేరిట అడ్డదిడ్డంగా
కట్టిన నాణ్యత లేని నిర్మాణాలు,
రహదారులతో...
అనుమతులు పొందకుండా
చెరువుల్ని ఆక్రమించి కట్టిన
బహుళ అంతస్తుల భవనాలు
సహా ముంపుకు గురవుతూ...
ప్రతిసారీ ఇదే విధంగా
పునరావృతమౌతూ!
ముందు జాగ్రత్తలు తీసుకోకుంటే,
ముందు ముందు మరింత
ముప్పు చెలరేగి...
గుణపాఠం నేర్వకుంటే
పర్యావరణ పరిరక్షణకు
పాటుపడకపోతే...
స్వయంకృతాపరాధానికి
పర్యవసానం ఇంతేగా మరి!
ప్రజల బ్రతుకు త్రిశంకు స్వర్గంగా
మారును మరి!!

-చంద్రకళ. దీకొండ
9381361384




ప్రశాంతమైన ఆనంతాకాశం
హఠాత్తుగా మేఘావృతమైంది
దట్టమైన మేఘాలు దృఢమై
మానవ తప్పిదాన్ని ఓర్వలేని
ప్రకృతి ప్రచండ తాండవంలో
తిలాపాపం తలాపిడికెడన్నట్టు
ఎడతెగని కుంభవర్షధారలతో
సకల ప్రాణికోటి చెల్లాచెదురైంది
పక్షి గూళ్ళు పడవలై తేలాయి
శాంతి కపోతాల జాడే లేదు
పేదోడి గుడిసె ఉనికి ఉసేలేదు
ముల్లె మూటలు నీటిపాలవగా
గొడుగు గూడే నీడై నిలవగా
దుఃఖ సాగరాన్ని దాటడానికి
ప్రాణాలను చేత పట్టుకొని
పిల్లాపాపల చంకనెట్టుకుని
దారి తెన్ను తెలియని దారిలో
గుండెలవిసిపోయే రోదనల
కన్నీటి జలపాతధారలుఏరులై
వర్షధారలతో మమేకమైనాయి
వానదేవుడా! ఇకనైనా శాంతించి
కష్టజీవుల కరుణించి కాపాడు
ప్రకృతి విధ్వంసానికి ఒడిగట్టే
మానవాధముల మట్టి కరిపించు
ప్రకృతి ఒడిలో మనుగడ సాగించే
పేదప్రజపై ప్రేమసుధల కురిపించు

-డా. నమిలకొండ సునీత
9908468171




ఓ వాన దేవుడా !
మాకెందుకు .. ఈ శాపం
ఎంతకీ ఆగని వానలు
పొంగిపొర్లుతున్న వాగులు
అలమటిస్తున్న జీవులు .
ఆశతో కట్టుకున్న మేడలు
కూలిపోయి
అల్లుకున్న బంధాలు ఓడిపోయి
పిడికెడు మెతుకులు దొరకక
తలదాచుకునే గూడు లేక
చెట్టుకొకరు పుట్టకొకరు
పాపమని పలకరించరు
కన్నీళ్లను పట్టించుకోరు ..
కానీ
మాటలునే కుమ్మరిస్తారు
ఓ మనిషి !
కాస్త మనిషిలాగ మారరాదు
కొంచెం మానవత్వం చూపరాదు

-యడవల్లి శైలజ
9394171299




కాలం తన పని తాను చేస్తున్నా
తప్పుగానే తోస్తుందిపుడు..
అతి వృష్టి సృజించిన కల్లోలంతో..
కన్నీళ్ళ వరదలు, విలయ తాండవం గావిస్తూ..
మానుష మనుగడ మృగ్యం చేస్తోంది..
తప్పెవరిది... ఓ మనిషి..
నీదా,, ప్రకృతిదా..
సౌకర్యాలు,సౌలభ్యాల వేటలో..
సహజ సిద్ధ వనరులను కొల్లగొడుతూ..
జనీతు జీవజాలాన్ని నిలువ
నీడ లేకుండా బెదర గొడుతూ..
అందిన కాడికి అప్పనంగా
భూకబ్జాలు చేసేస్తూ...
అడవులను అంతమొందిస్తూ..
ప్రాణి కోటికి సవ్యంగా అందాల్సిన
ఋతు చక్రం చిన్నాభిన్నం చేస్తూ ...
ఒకటా రెండా నీ దాష్టికాలు..
ఘనమైన నీ జీవన సుఖం కోసం...
నీటి జాడలను చెరిపివేస్తుంటే..
ఆకాశ హర్మ్యాలు చూసి
మురిసిపోతున్నవే గానీ..
తత్పరిణామం ఊహించలేకపోతివి..
ప్లాస్టిక్ భూతాన్ని ప్రపంచానికి
పరిచయిన్చి,
పాప కూపంలో తోసేస్తివి..
ప్రకృతి కన్నెర్ర జేస్తోంది మరి..
ఈ దమన కాండ సాగితే
ఇక ప్రళయమే..
భూమి పాప భారాన్ని మోయలేక,
తల విదిలిస్తోంది.
సర్వం జలార్పనం..
జీవ జాతుల అంతం..తప్పదేమో..

-వనితారాణి.నోముల
7396320424




అవును
ఇది విలయమో,
ప్రకృతి ప్రళయమో...
ఓవైపు మిన్నేటి వాన
మరోవైపు జనుల కన్నీటి వాన
ఆగకుండా కురిసే వానకి వరదేలే అడుగడుగునా....
ఇళ్లన్నీ మునిగి కన్నీరే మిగిలినా
....
ఎంతమంది చేయందిస్తే బాగుపడతాయి
ఈ బురద బతుకులు..
ఎన్ని ఆపన్నహస్తాలు చేయూతనిస్తే
అన్నం తింటాయి ఈ నిరుపేద కడుపులు...
ఓ వైపు పసికూనలు
మరోవైపు కాటికి కాల్లుచాపిన వాళ్ళు
ఎవర్ని ఎలా కాపాడుకోవాలో తెలియక
నిట్టూర్పుల గోదారిలో కూరుకుపోతున్న జీవితాలు..
మెతుకు మిగులలేదు...పైస నిలువలేదు
పండించిన పంటకు ఆనవాళ్లు లేవు
చదివిన చదువుకు ఆధారాలు లేవు..
ఆస్తిపాస్తులకు అధికారాలు లేవు...
ఎముకలు కొరికే చలిలో
ఒంటిని దాచుకునేందుకు దుస్తులూ కరువు...
వినే వారేరీ ఘోర వరద బాధితుల ఏకరువు...
ఎన్నాళ్లకు బతుకు గాడిన పడుతుందో
ఎన్నెన్ని గండాలు అధిగమించాలో...
నిన్నటిదాకా కట్టిన అద్దాల మేడలు కుప్పకూలిపోయాయి
సొంతింటిపై ఆశ వదులుకుని
పునరావాస కేంద్రాలకు
దారి పట్టినవాళ్ళకి సొంతవాళ్లెవరు..
పరాయివాళ్లెవరు
రేపో మాపో మబ్బులు మసకేసినా
వరదలు కనుమరుగైనా
అతలాకుతలం అయిన వరదబాధితులకు
ఇప్పటినుండి జీవనసమరం...
తృణమో,పణమో
అందించిన వారి సహాయం అమరం...

-అపర్ణ.మధు
9959500380




వరుణుడు అతిగా కళ్ళు ఎర్ర చేసే బిడు వారిన
భూములన్నీ పిచ్చి మొక్కలు నిండే,
చితికి చితికి వానలు పెద్దగా మారిసముద్రంతో నిండే వరుణుడి కడుపునిండే,
తినుటకు తిండి లేదు తాగడానికి మంచి నీళ్లు లేవు మధ్య
తరగతి జీవితాలు మండే,
పైసలే పరమాత్మ అన్నట్లుగా ఉన్న, అవి ప్రకృతి చేతిలో కీలు బొమ్మలు,
ప్రతి జీవి ఆశలతో వెర్రి చూపులు,
ఆదరిస్తారని ఎవరికీ ఇవ్వాలి చేయూత, ఎవరికి అందించాలి ఊతం,
భగవంతుడి విలాస అట్టహాసంలో అందరూ పావులే సుమ, అందరూ సమానులే,
మనిషి చేయలేని పనులు ఎన్నో, చేసే పనులు కూడా ఎన్నో,
అయినా ఆ విధి విలాసంలో రాసి ఉంచిన లిఖితపూర్వకం,
అది మనకు తెలియదు, ఎంత ఉన్నా ఆ విష్ణు మాయలో ఓ చిన్ని మట్టి బొమ్మలం,
జల ప్రళయంలో కన్నీటి ఘోష, వినిపించని కంఠ శోష క్షణక్షణం భయం భయం
భరించలేని వేదనం..

-విశ్వప్రభ
9490374697

## కృష్ణమ్మ తాండవం -మానుష తప్పిందం

ఉప్పొంగి ఉరకలేసిన కృష్ణమ్మ
ఉప్పెనై ముంచే మానవాళిని
తప్పేమిచేసెనో నరులు
తప్పునా ఈ వరద ఇతి బాధలు.
తమ తమ తప్పిందముల మన్నింపు
తప్పించుమా మృత్యుభయము
ముంచెత్తు వరదల నడుమ
కనకదుర్గమ్మ కావలి కాయవే మా తల్లి
ఆలుమగల కొంగుముడి వీడేను
తల్లి పిల్లల పేగుబంధము మెలివేసేను
గూడు నీడలేక గుబులుచేరే గుండెలోన
అన్నపానీయములులేక అణగారే ఆశలు.
ఆకాశగంగా మింటిధారగా కురిసే
వాగువంకలు గట్టు గడప దాటే
ఇల్లువాకిళ్ళు చేరే దుఃఖపు లోగిళ్లు
జటాజుటాన బంధించరా శంకరా గంగను మరోమారు

-వింజరపు. శిరీష
8099441446

## రాష్ట్రపతి నిలయంలో అద్భుతంగా జరిగిన కవి సమ్మేళనం



తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనం అద్భుతంగా జరిగాయి. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అయినంపూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో మౌనశ్రీ మల్లిక్, ఓలేటి పార్వతీశం, కమలాకర శర్మ, సౌమ్య, సూర్యకాంతి, రాకేష్ భవాని, సిరి పాల్గొన్నారు. రాష్ట్రపతి నిలయం మేనేజర్ రజనీ ప్రియ ప్రతి విషయంలో శ్రద్ధ తీసుకున్నారు. అడుగడుగున అతిథి మర్యాదలు చేశారు. ఇది మర్చిపోలేని కవి సమ్మేళనం అని కవులు ప్రస్తుతించారు. సుమారు రెండువేల మంది విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. వివిధ పోటీలలో బహుమతి పొందిన విద్యార్థులకు కవుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.




నాడు
మూరెడు లోతున తవ్వితే
ముచ్చటగా తీయని నీరు
పంటలకు పశువులకు
దాహాలకు దొరికే తీరు
ఊరికి నాలుగు వైపులా చెరువులు
పంట పండుటకు వీలుగా కాలువలు
చల్లనైన ప్రకృతి హాయి గొలిపే
జన జీవన సంస్కృతి
నేడు
నాగరికత విశృంఖలత్వం
పెరిగిన నగర జీవనం
తగ్గిపోయెను చెరువులు
ఇంకిపోయెను నీటి దొరువులు
ఆక్రమించిన చెరువు నేలలో
వెలసిన బహుళంతస్తుల భవనాలెన్నో
కురిసే వర్షం ఇంకే దారేది?
పారే నీటికి పోయే తెరువేది?
చేసిన నాశనం చూస్తూ ఉంటే
శాంత గంగమ్మకు రాదా ఆగ్రహం
సముద్రునితో కలిసి ముంచెత్తదా సర్వం
మనిషీ నీ స్వార్థం వీడుకో
లేదా నీ సర్వస్వం వదులుకో

-నాగమంజరి గుమ్మా
9985667500

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1245వ రోజు 'ఫోటోగ్రఫీ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. "ఫోటోగ్రఫీ" అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు..



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,
9441046839

## స్మైల్ ప్లీజ్!!

చిత్రమే ఎవరికి వారే పోటీ పడటం
ఉన్నంతలో అందంగా పూవైపూయడం
స్మైల్ ప్లీజ్ !
మోముపై మెరిసే చిరునవ్వుల వెన్నెల.
ఇదో ప్రత్యేక ప్రపంచం
కెమెరా అద్దంలో ప్రతిబింబమైన చోద్యం.
నిన్నటి మధుర జ్ఞాపకాల జాలెసంచి
రేపటి తరానికీ అందించే పుష్పగుచ్ఛం.
వార్తల వారధికి సజీవ స్వరం
తాను మాట్లాడుతూ
మాట్లాడిస్తూ నడిపిస్తుంది.
చేతికందిన సాంకేతికతలో
వటవృక్షమై వేళ్లూనుకున్న ప్రకృతి కుంచె
అడవినీ ఆమనినీ
కలువను కడలిని
కలిపే మణిమయ రత్నదీప రూపం.
తాను నగ కాదు
కాని నగిషీల పెట్టెకే పట్టు పరికిణీ
కొంటె చిత్రాల కోణంగి
బాధమయ దుఃఖాలను మోసే అమ్మ.
ఫోటోగ్రఫీ
అదో గొప్ప కళారాజ నిధి
శాంతికి ఆకుపచ్చ
పత్రహరితమైన పెన్నిధి.
ఒక్కో భావ చిత్రం
వేవేల ఆలోచనల పుటం పెట్టే
చైతన్యం దండిగా
దండు కట్టిస్తుంది
మణికట్టుపై రాఖీ కట్టి.
అనుబంధాల విందు చేస్తుంది
మది దోచే శిల్పతరంగిణీ వైభవం
భావాల అలలపై
ఊయలలూపే అంతరంగం.

-ఏడెల్లి రాములు

## మంత్రాల పెట్టె

ఫ్రెంచిలో బైలెల్లినా
గ్రీకుభాషలో బోధించినా
వందలేండ్ల కృషి దాగినా
వరసంపత్తియే ఈనాడు.
తెలుపు నలుపుల చిత్రమై
తొలి నడకలు నడిచినా
సప్తవర్ణాల సరాగమై
గుప్తంగా మనసు దోచింది.
మరిచిపోలేని మహోన్నత
ఘట్టాలను మళ్ళీ మళ్ళీ
తరచి చూసుకునే వెసులుబాటు
కల్పించి తరించింది.
ఖరీదైన ఖద్దరు మడతలా
కొన్ని రోజులు ఫోజు కొట్టినా
డిజిటల్ ప్రపంచంతో
సామాన్యునికి చేరువయ్యింది.
మనుషులంతా చేరుకోలేని
మహిమాన్వితాలను కూడా
మది దోచుకునే విధంగా
భద్రపరిచి చేరువ చేయగల
మంత్రాల పెట్టె అది.

- నగునూరి రాజన్న

## ఛాయా చిత్ర కళ

ఛాయాచిత్ర కళ
అదొక కళ
మనసుని లాగేసే కళ
ఖరీదైన కళ అయినా
కళా ప్రేమికుడు
ఖర్చుకు వెనకాడని కళ.
కటకశాస్త్రం
రసాయన శాస్త్రాల సంగమం
ఆలోచింపజేసే
చక్కటి సృజనాత్మక కళ
ఒక్క చిత్రం
పేజీలకొద్దీ
వార్త సారాంశానికి సమానం.
కాంతి ఆధారిత కళ
ఫిల్మ్ పై నెగటివ్
కాగితం పై రసాయనిక ప్రింట్
మనసుల్ని మురిపించు
ఆత్మీయుల్ని దగ్గర చేర్చి
పాతజ్ఞాపకాలని తవ్వి
మధుర స్మృతుల్లో ఓలలాడించు
ప్రసార మాధ్యమ ప్రగతితో
ప్రగతిపథం లో నడుస్తున్న కళ
చక్కటి ఉపాధి కల్పన.

-మోటూరి శాంతకుమారి

## చిత్రమా... విచిత్రమా

అలనాడు
చిత్రకారుల హస్త నైపుణ్యం
ఈనాడు
గాజుకటకాల వింత విన్యాసం.
కదిలే చిత్రాలు
చెదరని చిత్రాలు
కాంతిగ్రాహక విచిత్ర పరికరాలు
నలుపు తెలుపుల నుండి
రంగు రంగుల రంగేళీలు
ఎలక్ట్రానిక్ సాంకేతికత
చేదోడు వాదోడై
డిజిటల్ యుగంలో
అన్నిరంగాలని అధిరోహించి
మకుటంలేని మహారాజై
ఏలి పాలించే ఫోటోగ్రఫీ
అపర బ్రహ్మగా లేనిదాన్ని ఉన్నట్లుగా
ఉన్నదాన్ని లేనట్టుగా
భ్రమలు కలిగించి
విర్రవీగే చిత్ర విచిత్రాల కళలు

## చిత్ర రాజం!

ఫోటోగ్రఫీకి శ్రీకారం చుట్టిన
లాలా దీన దయాళ్ ప్రారంభించిన
ఛాయా చిత్ర రాజం
కన్నులవిందుగా రంగులద్దిన
తీపి గురుతుగా
తరతరాల జ్ఞాపకాలకు

కల్లలు ఫోటోగ్రఫీ సొంతం
పొంత చెంతల కొత్త వింతల
సీమలేని విన్యాసాల
వెలిగి మురిపించే
మాయమిద్యల పెత్తనం
చెలాయించే చెంచులమ్మ
చిత్ర విచిత్రాల ఫోటోగ్రఫీ.

-రాజప్ప

ప్రత్యక్ష సాక్ష్యం.
మరిచిన బాల్యాన్ని
మళ్ళీ గుర్తుకు తెస్తుంది
అమ్మ ఒడిలో ముద్దులు కురిపిస్తూ
ఆటల పాటల అల్లరి స్మృతులను
అందిస్తుంది
మనసును దోచేస్తుంది
బంధాలను అనుబంధాలను
నెమరువేయిస్తుంది
ఆత్మీయతతో..
విద్యా వ్యక్తిత్వంతో
నిండిన చెలిమిని
పంచుతుంది ప్రేమతో
ఫోజులు కొడుతుంది
చిత్ర విచిత్ర విన్యాసాలతో
మన అందాలను చూపిస్తుంది
వివాహ వేడుకలను చిత్రిస్తూ
మురిపిస్తుంది
ఆనందాలతో ఊయలలూగిస్తుంది
ఆహ్లాదంతో
పండుగల సంబరాలతో
హాస్య వినోదాలను పంచుతుంది
అంబరమంత సంబరంతో.
మరిచిన మధుర జ్ఞాపకాల్ని
తిరిగి గుర్తుకు తెస్తుంది
కాంతి కిరణాలతో అనుసంధానం
హస్తకళా నైపుణ్యం
సకల చరాచర జగత్తును చిత్రించే
మనసులను దోచుకున్న
మధురమైన అనుభూతుల
సమాహారం ఫోటోగ్రఫీ.

-పి.పద్మావతి

## చిత్రం భళారే విచిత్రం!

చిత్రం భళారే విచిత్రం
మనమొహాలు మనమే
ఎంచక్కా చూస్తూ పరవశించే
ఆల్బంలో దాచుకుని
పదేపదే చూసుకుని మురిసిపోతూ
కాయం పోయినా
ఫోటో తరతరాలుగా శాశ్వతం.
బాల్యపు బోసి నవ్వులు
బడిలో కాలేజీ లో కోతి చేష్టలు
ముత్తవ్వ ముత్తాతలు మొదలు
నాల్గో తరం మనదాకా
ఉమ్మడి కుటుంబాల సంబరాలు
హాస్య వినోదతోరణాలు
కోల్పోయిన ఆత్మీయులను
బంధుమిత్రులను
చూస్తూ జలజలా రాలే కన్నీరు.
వెయ్యి మాటల్తో
చెప్పలేని భావం
ఒకేఒక క్లిక్ తో అవగతం
పేపర్లలో ఒకే ఒక్క ఫోటో
గుట్టు విప్పి చెప్పు
నిరక్షరకుక్షి కూడా
గ్రహించు సత్యం.
నేడు సెల్ఫీల మోజుతో
ప్రాణాలు పోగొట్టుకునే పిచ్చితనం
కడుపుకోతతో
గుండెలవిసే జనాలు
దేనికైనా ఉండాలి హద్దు
అతి వద్దు.

-ఎ.రాజ్యశ్రీ

## సజీవ సాక్ష్యం

ఫోటో, గ్రాఫ్ అన్న
గ్రీకు పదాల నుండి
ఫోటోగ్రాఫ్ ఉత్పన్నం
ఫోటోస్ అంటే కాంతి
గ్రాఫ్ అంటే చిత్రీకరించడం.
క్లిక్ ఒక్కటి
భావాలు అనేకం
అవి సమాజానికి
చేరవేసే మాధ్యమం
ఫోటోగ్రఫీకే అన్నది
దాని నామధేయం
కాలగర్భంలో కలసిన చరిత్రకు
ఫోటోగ్రఫీనే చెరగని సజీవ సాక్ష్యం.
ప్రకృతి రమణీయ దృశ్య రాజం
సకల చరాచర జీవకోటి జీవన యానం
కళ్ళను కట్టిపడేసే ప్రతి విచిత్రం
హృదయాలను హత్తుకునే ప్రతి చిత్రం
కావాలంటే పది కాలాలు పదిలం
ఫోటోగ్రఫీ తోనే సాధ్యమయ్యే కార్యం
కనుమరుగైన పెద్దల జ్ఞాపకాలను
అరుదుగా కలిసిన ఆప్తులను
పసితనపు పసిడి స్మృతులను
వివాహాది వర్ణమయ వేడుకలను
స్ఫురణకు తీసుకు వచ్చేది
ముందు తరాలకు మోసేది

-జె.వి.కుమార్ చేపూరి

## అందాల బొమ్మలు- తీపి గుర్తులు

తాను చూసినది
ఆనందించినది
అందంగా రూపాంతరం చేసి
జీవితంలో మరువకుండా
అందించడమే ధ్యేయం!.
ఫోటో అంటే చిత్రం
గ్రఫీ అంటే గీయడం
కాంతిపుంజాలతో
యధాతథంగా చిత్రాన్ని
రూపొందించి చూపు
ప్యారిస్ లో అడుగుపెట్టే
18వ శతాబ్దిలో కాలక్రమేణా
రంగులద్దుకుని
అందాలు పుంజుకుని
తీపి గుర్తయింది.
కనులకింపు
సంతోషదాయకం
కమనీయమైన గుర్తు
కడవరకు నిలుచు.
మనిషికి
మంచి బహుమానం
జ్ఞాపకాల పందిరి
మరువలేని
మరువరాని
తీపి గుర్తు!!.

-కె.కె.తాయారు

## గత స్మృతి

గత స్మృతుల కళా వేదిక
వాస్తవ చిత్రణలో శతశాతం
పెళ్ళి పేరంటాల చిత్రణకు ఫోటోగ్రఫీ
కనిపించని అందాలు
కనువిందుగా అందిస్తుంది
పూర్వీకుల పునశ్చరణంలో ఫోటోలు
చిత్తరువుల చిత్రమెంతో ఈ వేళ
మనరూపురేఖలే
మనకు వింతగొల్పుతూ
చరిత్ర మాటున
వ్యక్తుల అభివ్యక్తీకరణ
రెండువందల ఏళ్ళ
సుదూరపయనం
కాలక్రమంలో
మార్పులు చేర్పులు ఎన్నెన్నో
ఒకనాటి చిత్రరాజం
నేడు వెలిసినట్లుగా
వందేళ్ళ క్రితపు చిత్రాలు
నేడు విచిత్రాలుగా
అందరికీ అందుబాటులో
చిత్రమాలికలు
నలుపు తెలుపు
ఛాయాచిత్రాలు ఒకనాడు
రంగురంగుల చిత్రమాలికలు
నేటితరానికి
డిజిటల్ యుగంలో అద్భుతాలెన్నో.

-లక్ష్మారెడ్డి పసుల

ఫోటోగ్రఫీ మాత్రమేనన్నది
ప్రపంచమెరిగిన వాస్తవమది.
ప్రతి మనిషి జీవన యానంలో
ఫోటో ఒక అంతర్భాగం
ఊహలకతీతం అది లేని జీవితం.

# చిట్యాల ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భావం



సభలో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి. వేదికపై భూపతి వెంకటేశ్వర్లు, నర్సింహులు, పోశెట్టి ఉపేందర్, కృష్ణ, సంపత్ తదితరులు.

ప్రపంచానికి తెలంగాణ సాయుధ పోరాట పాఠాన్ని నేర్పిన వీరనారి చిట్యాల ఐలమ్మ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఐలమ్మ మనవడు చిట్యాల రామచంద్రం, అధ్యక్షురాలు చిట్యాల శ్వేత ఆధ్వర్యంలో ఐలమ్మ ప్రజా సంక్షేమ సంఘం ఆవిర్భవించింది.

ఈ సందర్భంగా మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం జరిగింది. ముఖ్య అతితిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి ఐలమ్మ చేసిన పోరాటాన్ని వివరించారు. ప్రభంజన్ యాదవ్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, రజక అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ.. ఐలమ్మ విగ్రహాన్ని, రజక కార్పొరేషన్, రజక భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా విశ్వ విద్యాలయానికి ఐలమ్మ పేరు పెట్టాలన్నారు. సంఘం నాయకులు పోశెట్టి ఉపేందర్, కృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం- కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ -కందుకూరి శ్రీరాములు, -బెల్లంకొండ సంపత్ కుమార్

-సంపాదకులు..

## నేనే

గంగలో మునిగాను
అలకనంద అందాలను చూసాను!
భాగీరథీ నదిని చూసి
ప్రయత్నమంటే తెల్సుకున్నాను!
కావేరీ జలాల పుష్కరస్నానమే చేసాను!
చిత్రావతీ నదాని చిత్రంగా చూసాను!
హడ్సన్ నది కథలనుఆనందంగా విన్నాను!
గోదావరిలో పడవ ప్రయాణం చేసాను !
సీలేరు నది ఇచ్చే పంటకు పరవశమొందాను!
కృష్ణానది కథలెన్నో విన్నాను!
తుంగభద్ర- బ్రహ్మ పుత్ర నదులకు భయపడ్డాను!
ఈ నదుల నీళ్లన్నీ మధురాతి మధురం!
ఈ నదులతో నిండిన సముద్ర నీరంతా
ఉప్పగా-చేదుగా ఎందుకు మారాయంటావు పద్మజా?
అన్ని నీళ్లున్నా పుడిసెడు ఎందుకు తాగలేదమ్మా?
నదీనీటిని తెగపొగిడినతెంపరీ!
ఎత్తైన పర్వత శిఖరాలు పుట్టినిండ్లైనా...
అత్యంతాద్భుతమైన ఒంపుసొంపుల నడకలున్నా...
ఆకుపచ్చ జరీనేత చీరలు కట్టినట్టున్న
పచ్చిక మైదానాలున్నా....
తీయని నీటితో జీవుల కడుపు నింపినా...
ఎంత దూరం వెళ్తారు?
ఎక్కడికి వెళ్తారు?
మీ నదులన్నిటికీ మగ దిక్కు నేనే కదా!
అనే అహం ఉప్పగా మార్చిందేమో?

-రంగరాజు పద్మజ

## అమ్మ జ్ఞాపకం

కళ్లముందు కనబడే నేను
కాస్త దూరమవుతానన్న కలవరం కంటే
క్రొత్త ఇల్లు కట్టుకున్నానని
ఆనందమే అధికమై
అమ్మ కళ్లలోమెరుపైయ్యింది
అమ్మమనసు ప్రేమ సముద్రం కదా
అంతకంటే గొప్పదేదైనా ఉందంటావా
ఈ లోకంలో నీకైనా నాకైనా
నాకు కష్టమొస్తే అమ్మకళ్లు కళ్లు కావు
కన్నీళ్లబికే చెలిమవుతాయి
గణితశాస్త్ర మేధావైనా
అమ్మ కన్నీటిబొట్టు
ఖరీదెంతో లెక్కగట్టగలడా?.
నా జీవితం అమ్మ వరమే
ఏ కానుకలు అక్కర్లేదు నాకు
నా క్రొత్తింటికి
ఒక పాత నవారు మంచం
అడగకుండానే పంపించింది
అమ్మ ప్రేమ కానుకనుకున్నాను .
మా ఇంటికి అమ్మ రావడమే పండగ నాకు
హాలులో అమ్మని నిద్రకి రమ్మని
ఆ పాతమంచమే ఆహ్వానం పలికేది
మంచం అరిగిననాలుగు కోళ్ళ లో
ఒకదాని తలశిథిలమై ఇనుపతీగ కట్టుకుని
వైమూలగా మారితేనేమి
నాకదెంతో అపురూపం.
దయలేని మరణం దానికేం
చెప్పాపెట్టకుండా వచ్చి
దాని అస్తిత్వం చాటుకుని భుజాలేగిరేసింది
మా అమ్మ ప్రేమఅనంతమనీ,అజరామరనీ
దానికి తెలియక.
ఇపుడు తెలిసీ ఏ చెట్టు కిందో
తప్పు చేశానని తలవంచుకుని
బాధపడుతుందేమో బహుశా.
ఇపుడు హాలులో

నా గాయపడ్డ హృదయానికి
ఓదార్పు ప్లాస్టర్ టేపు చుట్టుకోవడానికి
కష్టసుఖాల్ని నెమరేసుకుంటూ పడుకోవడానికి
పాత నవారు మంచం అలాగేఉంది
అమ్మ లేని ప్రపంచం గ్రీష్మకాలఎండలకు
మబ్బులు పట్టిన ఆకాశంలా
ఆవారించి ఉంది నా హృదయంలో.
పాత నవారు మంచం
పడుకుంటే నిద్రబుచ్చుతుంది
మేలుకుంటే వేకువ వైపు వెన్నుతడుతుంది
అమ్మ లాంటి ధైర్యం నాకది.
పాత నవారుమంచం ముందు
ఒంటరిని అవుతూనే అనేక 'నేను'లవుతూ
అమ్మ స్ఫూర్తితో కార్యోన్ముఖున్నవుతాను.
అమ్మ దూరమైనా
అమ్మ ఊసుల్ని,ఆశల్ని
అనంత ప్రేమల్ని
తొలకరివానలకి తడిసినమట్టిలా
జీవంపోస్తుంది
పాత నవారు మంచం
ఆ పాత నవారు మంచం
మంచం మాత్రమే కాదు
మా హాలులో ఉన్న అమ్మ జ్ఞాపకం
ఆశీస్సులు అందిస్తున్న అమ్మమనసు.

-రమేశ్ నల్లగొండ

## నీ గమ్యం?

మీ అడుగుల గమనం వైపే
కన్నవాళ్ళ భవితవ్యం ఆధారపడింది
అనాథాశ్రమాలా,ఆత్మీయ లోగిళ్ళా
ఎన్నో నోముల ఫలం మీరు
ఎన్నో పూజల ఫలితం మీరు
పువ్వులంత సుకుమారంగా పెంచుకున్నారు
కనుపాపలంత జాగ్రత్తగా కాచుకున్నారు.
చెట్లకుమల్లె ఏపుగా ఎదగాల్సిన మీరు
మాదకద్రవ్యపు మత్తులో చిత్తవుతుంటే
కన్నవాళ్ళ గుండెలిప్పుడు
అతుకుపెట్టలేనంతగా పగిలిపోతున్నాయి.
ఒక్కసారి వాళ్ళ ఆర్తనాదాలు వినండి
కాస్తయినా మీరు స్పృహలోకి వస్తారు
ఒక్కసారి వాళ్ళ గుండెచప్పుడు వినండి
కొద్దిగానైనా మీరు చలనశీలురవుతారు
ఒక్కసారి వారు కన్నకలల్ని పరికించండి
అరక్షణమైనా వాళ్ళ అంతరంగం
బోధపడుతుంది.
దొంగ చాటున చొరబడుతున్నాయో
దొరతనంగా చేరుతున్నాయో
కొకైన్ , హెరాయిన్ లాంటి
పేర్లు తగిలించుకొని
గునపంతో చెట్టును పెకిలించినట్టు
మత్తుతో దేశాన్ని పెకిలిస్తున్నాయి
ఒక వర్గం వారు కాదు
ఒక వయసువాళ్ళుకాదు
అన్ని వర్గాల వాళ్ళు,
అన్ని వయసులవాళ్ళు
గాలి పీల్చితనంత సులభంగా
గంజాయి పీల్చుతున్నారు
కోకా కోలా తాగినంత సులభంగా
కొకైన్ తాగుతున్నారు
ఇది ఎలాంటి భవితకు సంకేతం
ఇది ఎలాంటి మార్పుకు చిహ్నం
దేశానికి జవసత్వాలందించాల్సిన
ఉక్కు నరాలుమత్తు పదార్థాల వాడకంతో
చిట్లిపోతున్నాయి
దేశభారాన్ని మోయాల్సిన ఇనుప కండరాలు
హెరాయిన్ మత్తులో
గాలి తీసిన బెలూన్లవుతున్నాయి.

ఏవీ ఓటమిపై సంధించే నీ విజయస్త్రాలు
ఏవీ ఓటమిరక్కసిపై గెలుపొందిన
విజయ నాదాలు
ఏవీ దేశాభివృద్ధికి నీవు చేసిన ప్రతిజ్ఞలు
అంతా బూడిదపాలు కావల్సిందేనా.
ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు
జీవితమేమీ ఆరిపోయే దీపం కాదు
నువ్వు సరిగ్గా చేతులు అడ్డం పెట్టాలే కానీ
తడారి పోయేదాకా వెలగనంటుందా
నీ అడుగులు సరైన దిశలో పడాలి కానీ
నిన్ను కన్న వాళ్ళు నిన్నుగెలిపించి
విజయ తీరాలకు చేరనంటారా
నీ గమ్యం సరైందిగా ఉండాలే గానీ
దేశమిప్పుడు అభివృద్ధి చెందనంటుందా

- ఎన్.నరేశ్ చారి

## బతుకు వాక్యం

అమ్మ ఒడిలో ఆడి పాడి
కమ్మనైన అమ్మ ప్రేమ
తత్వాన్ని జుర్రు కొంటాడు
తడబడి అటుబడి ఇటుబడి
లేచి నిలబడి
బతుకు వాక్యం తెలుసుకుందామని
పలక బలపమై బడి పాట పట్టిండు
విద్యార్థి
గురువు నల్ల బోర్డుపై తెల్ల అక్షరములై
మెరిసిండు
అక్షరాలను పలకపైకి వొంపుకొని
వాటితో ప్రయాణం చేసి
దోసిళ్ళ తో ఎత్తుకొని
మస్తిష్కంలో నింపుకున్నాడు
పొలంలో విత్తనాలు చల్లినట్లు
మొలకలై విరగబూసినవి
బతుకు దారుల నైపుణ్యాలను
నేర్పిస్తున్నాయి
ఆలోచనల జ్ఞానమై
ఒడిదోడుకులను అధిగమించినవి
సమాజంలో ఎటు చూసినా
అక్షరములు వెలిగి
కాంతులను వెదజల్లుతూ
చీకటులను పారదోలుతున్నయి
ఆ అక్షరము నేర్పిన త్రోవలు
సజీవమై సమాజాన్ని నిర్మిస్తున్నాయి

-గుండెల్లి ఇస్తారి

## కవి

ఆయన మనిషి కాదు
ఒక ఋషి
చూడకుండా ఉండని పరిస్థితి కల్పిస్తాడు
మనసు స్తిమితంగా ఉండనీయడు
కళ్ళు మూసుకొనో ఒక మూల కూర్చుని
జపమాల తిప్పినట్టు
కలం పట్టుకున్న చేయి కదులుతూనే ఉంటుంది
గొలుసు కట్టు రాతయిన
పదపదం అర్థవంతమవుతాయి
ఎన్నో పద చిత్రాలు ధ్వని వాక్యాలు ఉంటాయి
చిన్న గదే..గదినిండా గూళ్ళే
గూళ్ళ నిండా పుస్తకాలే
అసలు గదే కనపడదు.
గది మధ్యలో మంచం
మంచం మీద తను
కొన్ని వేల కవితలు రాశాడనడానికి
ఆ మంచమే సాక్ష్యం
ఎవరైనా వెళ్ళండి గదిలోకి
ఖాళీ చేతులతో వెళ్లినవారు
పుస్తకాల చేతులతో వస్తారు
మెదడు అంతా
కవిత్వంనిషా అయి నిండిపోతుంది
గదిలోకి వెళ్లి వచ్చిన వాళ్ళు
చాలామందే ఉంటారు
వాళ్ళంతారౌడీలో
రాజకీయ నాయకులో కాలేదు
కవులైసమాజాన్ని వెలిగిస్తున్నారు.

-కందుకూరి శ్రీరాములు

## బ్రతుకుపాఠం

ఆడుతున్న బాల్యం
అర్థాంతరమయ్యింది
ముడివేసి చదువును మూటకట్టారు
భర్త కన్నా ఒక్క అడుగు
వెనుకే ఉండాలని
ఆరోతరగతే ఆఖరు.
ప్రాయం వచ్చాక
దేవుడు వదిలెళ్ళాడు
పసిపిల్లలనిచ్చి
దేవతారూపం తీసేసాడు
బ్రతుకుభారం మీదేసి.
చుట్టూ అలుముకున్న చీకట్లు
రథచక్రం కూలిపోయింది
బండి సాగేదెలా
శోకసముద్రం కరిగేదెలా.
జీవితాంతం తోడుంటానని
చేసిన బాసట
మూణ్ణాళ్ళ ముచ్చటయింది
యవ్వనంలోనే జీవితం
కరిగిపోయింది.
కష్టాలకడగండ్లతో
మసకబారిన నేను
మరోయుద్ధంతో
కృంగిన నేను
రాటుతేలిన మనిషినై
సాగక తప్పదు
బ్రతుకు పాఠం నేర్వక తప్పద.
ఒక్కొక్కటి జోడించుకుంటూ
పోగుచేస్తూ
పిల్లలని ఎదపై సాగాను
బాధలు బరువెక్కుతూనే ఉన్నాయి
బంధాలు బాధపెడుతూనే ఉన్నాయి
నడిసంద్రంలో నావలాసాగి
త్రోవనేసి పంపిన నా కూనలను
బాధ్యతలు తీరాయి
అనుకున్న కానీ
కాలం వెంటొచ్చి
కన్నులు తడుస్తూనే ఉంటాయి
చచ్చేవరకు అన్నీ
తోడస్తూనే ఉంటాయి
తోడుస్తూనే ఉంటాయి

-కె.భానుజ

## నా రుబాయీలు

ఆకలి తెలియక ముందే ముద్ద పెట్టింది అమ్మ
నడకలు తప్పక మునుపే దారి కాచింది అమ్మ
నా స్వార్థమే తన పరమావధని తెలియదు నాకు
తన ప్రేమలో ఓలలాడించు పయోనిధి అమ్మ

చెలినై గాలితొ ఆటాడుతాను నేను
అలనై నింగిని ముద్దాడుతాను నేను
నా బాహువులను ఎవరు లెక్కించగలరు
అవనిని హత్తుకునెడి సముద్రుడను నేను.


అన్నీ మరచి ఆడుకొనగ నాకు అలలు ఉన్నాయి
నన్నే చూస్తూ మైమరచేందుకు శిలలు ఉన్నాయి
ఎంత అందమైనదీ సాగరమార్గం దేవుడా
మరు జన్మకూ చేపనవ్వాలను కలలు ఉన్నాయి

-రెడ్డిశెట్టి పవన్ కుమార్

## ఇట్లా మాట్లాడుకుందాం

చీమలు మాట్లాడుకుంటాయి
కలిసిన రెండు చూపులు
భావాలు వ్యక్తికరించినట్టు
గుంపులు గుంపులై
దారి పొడవై మాట్లాడుకుంటాయి
పశువులు పక్షులు క్రిమి కీటకాలూ
సంధానమవుతాయి
బండ రాయి అంటాం
వానకు పులకించిపొయిన
పొక్కిలి గుంటలో ఆర్ద్రమైనప్పుడు గాని
దాగి ఉన్న దారం కనపడదు'
మాట్లాడు కుంటేనే
మనుషులం
జల్లించిన మేఘం వలె
నిర్మలంగా జలాన్వేషణ చేస్తుంటాం
మాట లేకుంటే
నోరులేని టెడ్డీబేర్
బోసి పోయిన సోఫా మీద
చిన్న పోయి కూర్చున్నట్టుగా ఉంటది
బలాలు బలపడుతున్నాయి
బరువు బరువుతో బలహీనులు
పాతాళానికి పడిపోతున్నారు
వాళ్లంతా ఎవరు?
హక్కుదారులునేల వారసులు
కష్టానికి ఒళ్ళు దాచుకొని వాళ్ళు
స్వేచ్ఛ అందవలసిన వాళ్లు
ముండ్లలో మాట పెకలదప్పుడు
సంకెళ్ల పదం పాదం కదలదు
బరువెక్కిన కాళ్ళాడవు చేతులాడవు
ఇట్లా కలిసి మాట్లాడుకుందాం
పహారా నిలబడ్డ సైనికునిలా
పక్కకొచ్చి మాట్లాడుకుందాం
మనలను మనం కోల్పోయిన చోట
తప్పిపోయిన దారుల వెంట
గుర్తులు నాటి మాట్లాడుకుందాం
మనం మాట్లాడుకుందాం.

-బెల్లంకొండ సంపత్ కుమార్




సుముఖుడు
ప్రముఖుడు
విఘ్నాలు తొలగించే తొలిదేవుడు మన గజముఖుడు
-ఉదంద్రావు రమణబాబు
నరసన్నపేట

చేతిగీత
తలరాత
కర్మసిద్ధాంతానికి మించినవి కావని చెప్పేదే భగవద్గీత
-బి .బి.రవి కుమార్
విజయవాడ

సూత్రధారి
పాత్రధారి
ప్రతి ఒక్కటీ చేసేవాడు చేయించేవాడు చక్రధారి
-గడ్డం దేవీప్రసాద్
బెంగళూరు

అర్థం
పురుషార్థం
ఆధ్యాత్మికత మేళవింపుతో సాధువులు సాధింతురు పరమార్థం.
-శ్రీ పెరంబుదూరు నారాయణరావు
('శ్రీనారా')
హైదరాబాద్.

ఘోరాలు
నేరాలు
పాపాలు పెరిగితే భగవంతుడు ఎత్తుతాడు అవతారాలు
-శ్రీహరి , హైదరాబాద్

తొలి
మలి
ఎప్పుడైనా రావొచ్చును అవతార పురుషుడు కలి!!
-మిథున్, మార్టేరు.

బ్రహ్మచర్యము
గూఢచర్యము
మనిషికి అనివార్యము అత్యవసరము నిత్యకృత్య దినచర్యము!
-పట్నాయకుని రామకృష్ణారావు
కంచరపాలెం.విశాఖపట్నం.

అనుమానం
కాలమానం
భూతభవిష్యత్తులను తలవక ఆనందంగా గడపాలి వర్తమానం
-నెల్లుట్ల శ్రీనివాసులు, చెన్నై

మంత్రం!
తంత్రం!
జీవితానికి పరమార్థం భక్తి అనే యంత్రం!
-యలమర్తి మంజుల
విశాఖపట్నం

జలము
ఫలము
యేదయినా దేవునికి సమర్పించడమే భక్తికి మూలము
-రావెల పురుషోత్తమరావు
అమెరికా

నర్తన
కీర్తన
పేరు ప్రఖ్యాతలు నీకు తెచ్చిపెట్టేది ప్రవర్తన.
-ఋష్యశృంగు ధిల్లేశ్వరరావు
సారవకోట

వన్యచరితం
హరితం
ప్రకృతికీ సమాజానికీ అనంతబంధం మానవాళికి ఆహ్లాదభరితం
-ఆచార్య వై .వి.సుబ్రహ్మణ్యం,
హైదరాబాద్

గణపతి!
విఘ్నపతి!
తొలి పూజలు అందుకునే దేవరా! నీకే శరణాగతి!
-సిహెచ్.వి. బృందావన రావు
నెల్లూరు

సిద్ధి
బుద్ధి
మనకు ఉంటే -ఉండదు కాలుష్యనీ శుద్ధి
-లింగాల యుగంధరాచారి,
మదనపల్లె రచయితల సంఘం,

ఉద్యమించు,
శ్రమించు,
మానవత్వపు విలువలను పరిరక్షింప నిరంతరము పరిశ్రమించు!
-దినవహి సత్యవతి
గుంటూరు

కాదు
రాదు
అనవసరంగా మాట్లాడే వాక్కుకు విలువ లేదు
-రాయవరపు సరస్వతి
చోడవరం,అనకాపల్లిజిల్లా

విధేయత
ఆత్మీయత
ప్రతి ఒక్కరి జీవితంలో వుండాలి నిర్భయత
-కాటేగారు పాండురంగ విఠల్
హైదరాబాద్

రంగం!
భంగం!!
ఎన్ని అడ్డొచ్చినా జీవితంలో ఎప్పటికీ క్రుంగం!!!
-మన్నవ సుధాకర్
విజయవాడ

కలత
నలత
సరియైన జాగ్రత్తలు తీసుకోకుంటే పెరుగుతుంది వ్యాకులత.
-దోసపాటి వేంకటరామచంద్రరావు
విజయనగరం

అప్పుడు
ఎప్పుడు
గతం, భవిష్యత్తు - అన్నింటిచే ఉన్నది - ఇప్పుడు.
-కె. ఎమ్. కె. మూర్తి
సికింద్రాబాద్

రాత..!
గీత...!!
మనిషి జీవితం కాకుడదు ఎప్పుడూ రోత....!!!
-మహమ్మద్ అంకూస్
బెల్లంపల్లి

రణము!
కారణము!!
బ్రతుకు సమరంలో శక్తిని ఇచ్చేది ప్రేరణము!!!
-మన్నవ నాగ లలిత శ్రీదేవి
విజయవాడ

వంచకు
తుంచకు
నీ గౌరవం తగ్గేలా ఎవరికీ తలదించకు
-శేష శైలజ(శైలి)
విశాఖపట్నం

అల!
ఇల!!
కచ్చితంగా అమ్మ -ఇంట్లో నడిచే కోవెల!!!
-ఎమ్మెస్సార్ షణ్ముఖ ప్రియ
విజయవాడ

ఎదగడం
గెలవడం
ఎల్లప్పుడూ మనం అనుసరించాలి వినయంగా ఒదగడం
-శాంతమూర్తి, హైదరాబాద్

భవం
సంభవం
ఆయురారోగ్యాలతో ఆనందంగా బ్రతకడమే గొప్ప వైభవం!
-మొర్రి గోపి, కవిటి

కాలచక్రం!
రాశిచక్రం!!
ఉందో లేదో చూసుకో నీ భాగ్యచక్రం!!!?
-ఎమ్మెస్సార్ భార్గవి ప్రియ
విజయవాడ

కాకి
కాకి
సాటి మనిషితో కలవని వాడు ఏకాకి!
-ఎన్. ఆర్ .తపస్వి , చెన్నై

శబరి
కాదంబరి
రుచి చూసి నైవేద్యం పెట్టిన శాకంబరి.
-వి. యస్ .శాస్త్రి ఆకెళ్ల
విజయనగరం.

కట్టు
బొట్టు
ఆడపడుచు అందం ఇనుమడించే చీర- కంచిపట్టు
-డా ఉషారాణి కోగంటి
హైదరాబాద్

ఇత్తడి
చిత్తడి
ఎక్కడ ఉన్నా మెరుపు కోల్పోదు పుత్తడి
-సింగీతం విజయలక్ష్మి
చెన్నై

ఆలించె
పాలించె
గణేశుడే తలచి కొలచిన భక్తుల మొరాలించె!
-జి.యస్ .వి.సత్యనారాయణ
హైదరాబాద్

శ్రీఘనుడు
గజాననుడు
భక్తులచే మొదటగా పూజలందుకునే నాయకుడు 'మూషిక వాహనుడు'
-బిక్కునూరి రాజేశ్వర్,
నిర్మల్

కల
కళ
మరిపించి, మురిపించి వేసే అందమైన వల
-రమాదేవి ఊకంటి
హన్మకొండ

మెల్లగ
చల్లగ
నడక, చూపు -వక్రతుండుని ఏకదంతం తెల్లగ
-అచ్యుతుని రాజ్యశ్రీ
హైదరాబాద్

